www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 5-5-2024
Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తాడేపల్లిగూడెం ఓ

18 నుంచి శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు

ద్వారకా తిరుమల, మే 4 : ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామికి శ్రీక్రోధి నామ సంవత్సర వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 25 వరకు వైఖానస ఆగమయుక్తంగా నిర్వహిస్తామని ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 18న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా చేస్తారు. 19న ధ్వజారోహణ, 21న ఎదుర్కోలు ఉత్సవం, 22న రాత్రి 8-30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, 23న రాత్రి 7-30 గంటలకు రథోత్సవం, 24న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావ రోహణ, 25న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశకోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. వాహన సేవలు ఇలా.. 18న రాత్రి 7గంటలకు గజ వాహనంపై శ్రీవారి తిరువీధిసేవ, 19న రాత్రి 9గంటలకు హంస వాహనంపై శ్రీవారి తిరువీధిసేవ, 20న ఉదయం 7గంటలకు సూర్యప్రభ, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనాలపై తిరువీధిసేవలు. 21న ఉదయం 7గంటలకు హనుమంత వాహనం పైన, రాత్రి 8-30 గంటలకు వెండి శేష వాహనాలపై తిరువీధి సేవలు, 22న రాత్రి శ్రీవారి కల్యాణం అనంతరం వెండి గరుడ వాహనంపై తిరువీధి సేవ, 24న రాత్రి అశ్వవాహనంపైన గ్రామోత్సవం జరుగుతాయి.

కృష్ణాలోకి నూజివీడు

అధికారంలోకి రాగానే కలుపుతాం

- అమరావతికి పూర్వ వైభవం
- సైకో ప్రభుత్వంతో అంతా నాశనం
- మాదిగలు, మాలలకు న్యాయం చేస్తాం
- చింతలపూడి ఎత్తిపోతల పూర్తి నా కల
- అందరికీ ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు
- కూటమికి మద్దతు పలికి వైసీపీని ఓడించాలి
- నూజివీడు సభలో చంద్రబాబు పిలుపు



సభకు హాజరైన అశేష జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

నూజివీడుకు వరాలు

- నూజివీడు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం.
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు.
- పరిశ్రమలను రప్పించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం.
- అందరికి ఇళ్ళ స్థలాలు సమకూరుస్తాం. టిడ్కో ఇళ్ళను అందుబాటులోకి తీసుకువస్తా.
- డ్రైనేజి, రహదారి విస్తరణ, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉంటా.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తాం



నూజివీడు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి పార్థసారథి

ఏలూరు/నూజివీడు, మే 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నూజివీడును కృష్ణా జిల్లాలో కలపాలని మీరు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పకుండా చేస్తా.. ఈలోగా వీరు కూటమికి ఓట్లు వేసి మద్దతు పలకాలి. వైసీపీని ఓడించాలి' అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నూజివీడు ప్రజాగళం సభలో పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా నూజివీడులో శనివారం మధ్యాహ్నం మండుటెండలోనే వేలాది మంది హాజరైన సభలో చంద్రబాబు చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. మన మేనిఫెస్టో అద్భుతం అంటూ కీర్తించారు. నూజివీడు ఎమ్మెల్యే ఆయన తనయుడిపై విరుచుకుపడ్డారు. ఇక మీ ఆటలు సాగవంటూనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని లెక్కలు తీస్తామని నొక్కి చెప్పారు. చూస్తూ ఊరుకోబోమని ప్రతీది టచ్ చేస్తామంటూ హర్షధ్వానాల మధ్య కామెంట్లు చేశారు. తన పాలనలో మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు అవకాశం ఇచ్చేందుకు ప్రయత్నించాను. కాని ఈ సైకో ప్రభుత్వంలో అదంతా నాశనమైందని, తిరిగి యువతకు ఉద్యోగాలు ఇచ్చేలా పరిశ్రమలను రప్పిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

అమరావతితోనే నూజివీడు అభివృద్ధి

'అమరావతి రాజధానిగా ప్రపంచస్థాయిలోనే నెంబర్‌వన్‌గా నిలుపుదామనుకున్నా. దుర్మార్గుడు వచ్చాడు. మూడు ముక్కలని, అమరావతిని నాశనం చేశాడు. ఇది రాజధాని అయితే నూజివీడు నుంచే ఉద్యోగాలు చేసే వారంతా అమరావతికి వచ్చి వెళ్లేవారు. దీన్ని అంతా జగన్ చెడగొట్టాడు. కావాలనే ఇష్టానుసారం వ్యవహరించాడు. అమరావతి రాజధాని అయితే నూజివీడు సమీపాన ఔటర్ రింగ్ రోడ్డు వచ్చి ఉండేది. హనుమాన్ జంక్షన్ వరకు అద్భుతమైన మార్గం అయ్యి ఉండేది. దీన్ని జగన్ రద్దు చేశాడు. అమరావతికి పూర్వ వైభవం తెచ్చే బాధ్యత నాది. జగన్‌కు తెలిసింది విధ్వంసమే. నాకు తెలిసింది అభివృద్ధే. ఎమ్మార్పీఎస్ కూటమికి మద్దతు ఇచ్చింది. మాదిగలకు సరైన న్యాయం చేస్తాం. వర్గీకరణ విషయం పరిగణనలోకి తీసుకుంటా. ఇదే తరుణంలో మాలలకు ఇప్పటికే అన్యాయం జరిగింది. వారు కూడా కూటమికే ఓటు వేయాలి. కచ్చితంగా వారికి న్యాయం జరిగేలా చూసే బాధ్యత నాది. బీసీ వర్గాల సంక్షేమం కోసం ఇప్పటికే బీసీ డిక్లరేషన్ తెచ్చాం. కచ్చితంగా ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుంది. నూజివీడును సస్యశ్యామలం చేసేలా నా అంతట నేనుగా శ్రమించాను. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయటం నా కల. నాగార్జునా సాగర్ ఎడమ కాలువ ద్వారా నూజివీడుకు నీరు తెచ్చే అవకాశం ఉండగా, ఇది చాలా వ్యయ ప్రయాసలతో కూడుకుంది. అందుకనే దాన్ని కాదని చింతలపూడి ఎత్తిపోతలను అమల్లోకి తెద్దామనుకున్నాం. ఈ పథకాన్ని పూర్తి చేసి మీ చేలకు నీరందిస్తాం. తాగునీటికి కొరత లేకుండా చేస్తాం. ఇది పూర్తి అయితే మామిడి పంటకు నూజివీడు కేంద్రం. మామిడికి ఒక తడి వేయవచ్చు. మంచి పంటను దక్కించుకోవచ్చు. అలాగే ఇంకో పక్క జొన్న, పామాయిల్ వంటి పంటలను మెరుగుపరుచుకోవచ్చు.


ముద్దరబోయినతోపాటే ఓట్లు రావాలి

నూజివీడు కన్వీనర్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తిరిగి పార్టీలోకి వచ్చారు. ఆయన భవిష్యత్తు నేను చూసుకుంటా. ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వాలో అంతా ఇస్తా. కచ్చితంగా నూజివీడులో సారథి గెలవాలి. అన్ని ఓట్లు ఇటేపడాలి. అంటూ ముద్దరబోయిన ఎదుట చంద్రబాబు అసలు లక్ష్యం ఉంచారు. దీన్ని కాదని ఎవరైనా గీత దాటితే పరిణామాలు వేరే ఉంటాయి అన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు.

వ్యవస్థలను నాశనం చేసిన వైసీపీ : పార్థసారథి

నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ 'ఐదేళ్ల పాలనలో వైసీపీ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసింది. నూజివీడు నియోజకవర్గంలో తాగు నీటికి, సాగు నీటికి తీవ్ర కటకట ఏర్పడింది. మామిడి తోటలు ఎక్కడ చూసినా కాయ కానరాని పరిస్థితి. చంద్రబాబుకు పేరు వస్తుందనే కారణంతో ఈ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతలను ఆపి, 33 మండలాల్లోని రైతులను ఇబ్బంది పాలు చేసింది. ఫలితంగా పంట భూములు బీళ్ళుగా మారుతున్నాయి. త్రాగునీటిలో ఫ్లోరైడ్ చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ పరిస్థితి మారాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిందే. ఈ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే క్వారీ అక్రమాలకు బాబూరావు అనే ఒక ఎస్సీ సోదరుడిని బలి చేసి 3 కోట్ల 70 లక్షలు ఫైన్ వేయించారు. కాని ఆ క్వారీ అక్రమాల్లో ఎమ్మెల్యేకి, ఆయన కుమారుడికి పాత్ర ఉంది' అని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అట్లూరి రమేష్ వేదికపై ఉన్నారు.

జగన్ ఇల్లు బాగుపడింది : పుట్టా



మాట్లాడుతున్న పుట్టా మహేశ్

ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ 'మీ ఇల్లు బాగు పడితేనే నాకు ఓటు వేయండి అంటూ సీఎం వైఎస్ జగన్ చెబుతున్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో బాగుపడింది ఒక్క జగన్ ఇల్లు మాత్రమే. తాడేపల్లి, వైజాగ్, బెంగళూరు, హైదరాబాద్ ఇలా ప్రధాన నగరాల్లో ఆయన మాత్రమే ఇళ్ళు కట్టారు. పేదలకు మాత్రం ఒక సెంటు స్థలం ఇచ్చి నయవంచనకు గురిచేశారు. తన కుటుంబంలో చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ప్రజలకు ఏం న్యాయం చేస్తారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో ఏడు నుంచి 8 పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉద్యోగాలను కల్పి స్తాం. ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపితే మీ గళాన్ని నా గొంతుతో వినిపిస్తా. జాతీయంగా గుర్తింపు వున్న నూజి వీడు మామిడికి మార్కెట్ కల్పిస్తాం. జాతీయస్థాయిలో మామిడి ఎగుమతులకు రైల్వే రాక్‌లను తిరిగి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. కేంద్రం నుంచి అందుతున్న వివిధ పథకాల ద్వారా ప్రత్యేకంగా నూజివీడును అభివృద్ధి పథంలో నడిపిస్తా.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

- ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

ఏలూరు రూరల్, మే 4 : బీసీల ఉన్నతికి పాటుపడిన ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలను అణచివేశారని ధ్వజమెత్తారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా మోసగించారని మండిపడ్డారు. బీసీలకు సంక్షేమంతో పాటు అనేక పదవులు ఇచ్చి మెరుగైన భాగస్వామ్యాన్ని టీడీపీ అందించిందని వైసీపీ మాత్రం బీసీలను వాడుకుని వదిలేసిందన్నారు. నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ పదవులు అన్ని రెడ్డి సామాజిక వర్గానికే ఇచ్చారని ఆరోపించారు. పేదలకు సెంటు మాత్రమే స్థలం ఇచ్చి జగన్ మాత్రం ప్యాలెస్‌లో కట్టుకున్నాడని మండిపడ్డారు. వైసీపీ మేనిఫెస్టో పసలేదని, టీడీపీ మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్‌తో పాటు బీసీలకు రక్షణ చట్టం, అణగారిన వర్గాలకు చేయూతను అందిస్తూ మేనిఫెస్టో రూపొందించారన్నారు. పరిశ్రమలకు, యువతకు ఉద్యోగం, రైతులకు గిట్టుబాటు ధర వైసీపీ ప్రభుత్వం అందించలేకపోయిందన్నారు. తాజాగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చి భూములు లాగేసుకోవాలని చూస్తోందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పోలవరం, చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఏలూరు ప్రభుత్వాస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. శంకర్‌రావు మాట్లాడుతూ ఇటీవల బీసీ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశంలో చర్చించి ఎన్‌డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు విజయానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ హయాంలో బీసీల పై దాడులు, హత్యలు, భూకబ్జాలు పెరిగాయని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీలకు మేలు జరిగిందని, వైసీపీ బీసీలపట్ల అణచివేత దోరణి అవలంబించిందని మండిపడ్డారు. బీసీలకు మేలు చేసే తెలుగుదేశంపార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీసంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు బీమవరపు పాపారావు, నగర అధ్యక్షుడు మారగాని చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

1,70,198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు సిటీ, మే 4 : జిల్లాలో ఇప్పటివరకు 1,70,198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ లావణ్యవేణి శనివారం వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు 13,006 మంది రైతుల వద్ద నుంచి రూ. 337.07 కోట్లు విలువైన 1,70,198 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 24,461 మంది రైతులకు చెందిన 1,88,056 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నట్టు తెలిపారు. రైతులకు ఇంతవరకు రూ. 238.22 కోట్లు చెల్లింపులు చేశామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910లకు రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఓటేసిన ఐజీ అశోక్‌కుమార్



ఏలూరు క్రైం, మే 4 : ఏలూరు కోటదిబ్బ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో శనివారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇది ప్రభుత్వ కుట్రే ?



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో గందరగోళం

- పోస్టల్ బ్యాలెట్‌పై అధికారుల తీరు అనుమానాస్పదం
- భీమడోలు ఉద్యోగికి చింతలపూడి పోస్టల్ బ్యాలెట్ జారీ
- పోస్టల్ బ్యాలెట్‌కు దూరమైన గణపవరం మండల ఉద్యోగులు
- ఉద్యోగుల ఓటు ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా భావించే కుట్ర పన్నారంటూ ఆరోపణలు



ఏలూరులో పోస్టల్ ఓటేసేందుకు ఉద్యోగుల పాట్లు



ఏలూరులో తమ ఓటు గురించి అధికారిని ప్రశ్నిస్తున్న ఉద్యోగులు

ఏలూరు టూటౌన్/ఉంగుటూరు మే 4 : ప్రభుత్వ ఉద్యోగులు ప్రభు త్వంపై వ్యతిరేకతతో ఉన్నారు. వీరి ఓటు ప్రభుత్వానికి అనుకూలంగా పడదు. అందుకే ఉద్యోగులను ఎలాగైనా ఓటింగ్‌కు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రభుత్వం గందరగోళం సృష్టించిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. తమ ఓట్లు ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం కల్పించిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటల వరకు చాలాచోట్ల ఈ గందరగోళం మధ్య ప్రారంభం కాలేదు.

ఉత్తర్వుల జారీలో తికమక

జిల్లా అధికారుల నుంచి శుక్రవారం వచ్చిన సమాచారం ప్రకారం ఉద్యోగులు వారి సొంత నియోజవర్గం కేంద్రంలో గల ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ వినయోగించుకోవాలని ఉత్తర్వులు జారీ చేయగా సాయంత్రం నాటికి దీనిని మార్చి ఎక్కడ ఎలక్షన్ డ్యూటీ పడితే అక్కడే ఓటు వినియోగించుకోవాలని మరో ఉత్తర్వులు ఇచ్చారు. తీరా శనివారం ఉదయం ఓటు హక్కు వినియోగించుకునే నిమిత్తం ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లిన ఉద్యోగులకు మధ్యాహ్నం వరకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేయలేదు. పోస్టల్ బ్యాలెట్ ఎక్కడ ఉపయోగించుకోవాలో ఉద్యోగులకు ప్రభుత్వం అవగాహన కలిగించలేదు. ఉద్యోగులకు ఓటు హక్కు ఒక ప్రాంతంలో ఉంటుంది. వాళ్ల ఉద్యోగం వేరే ప్రాం తంలో చేస్తారు. ఎన్నికల డ్యూటీ నిమిత్తం వేరే కేంద్రంలో ట్రైనింగ్ ఇస్తారు. ఈ మూడు ప్రాంతాల్లో ఎక్కడ ఓటు వేయాలో ఉద్యోగులకు అధికారులు అవగాహన కల్పించలేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. కొంతమంది ఉద్యోగులకు తహసీల్దార్ కార్యాలయం నుంచి మీ ఓటు మా ఏరియాలోనే ఉంది పోస్టల్ బ్యాలెట్ ఫెసిలియేషన్ కేంద్రానికి వెళ్ళి ఓటు వేయండి అని ఫోన్‌కాల్స్ వచ్చాయి. తీరా ఆ కేంద్రానికి ఓటు వేయడానికి వెళ్తే మీ ఓటు ఇక్కడలేదని అధికారులు చెప్పడంతో ఉద్యోగులు నిర్ఘాంత పోతున్నారు. ఉద్యోగులు పని చేసే నియోజకవర్గంలో ఫారం-12 (ఉద్యోగి వివరాలు) ఇచ్చిన చోటే మీరు ఓటు వేయాలని అధికారులు చెబుతున్నారు. మరలా అక్కడ నుంచి ఫారం-12 ఇచ్చిన నియోజకవర్గ ప్రధాన కేంద్రం వద్దకు వెళ్లాలంటే 40, 50 కిలోమీటర్ల దూరం వెళ్ళాలి. ఇప్పటికే చాలా దూరప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చాం. ఈ ఎండల్లో మరలా అక్కడి ఎలా వెళ్ళగలమని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది అధికారులు మీరు ఎక్కడ అయితే ట్రైనింగ్ అయ్యారో అక్కడ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చని చెబుతున్నారు. తీరా ట్రైనింగ్ సెంటర్‌లో ఓటు వేయవచ్చని వచ్చిన వారికి నిరాశే మిగడంతో దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కరువు

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేక ఉద్యోగులు విలవిలలాడారు. మండుటెండల్లో ఎంతో దూరం నుంచి వచ్చిన వారికి కనీసం తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగుల్లో ఆగ్రహం పెల్లుబికింది. కనీసం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు ఎలా వేయాలో తెలియజెప్పే హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయలేదు.



నారాయణపురం ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు కూర్చున్న ఉద్యోగులు

- భీమడోలు పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగికి చింతలపూడిలో ఎన్నికల డ్యూటీ పడింది. అతను ఫారం-12 ను ఉంగుటూరులో దరఖాస్తు చేయగా అతనికి చింతలపూడి నియోజకవర్గ ఓటు బ్యాలెట్ జారీ చేయడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి గా నిదర్శనంగా మారింది.
- ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు మండలాల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను నారాయణపురం హైస్కూలులో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించు కున్నారు. అయితే నియోజకవర్గంలోని గణపవరం మండలం పశ్చిమ గోదావరి జిల్లాలోకి వెళ్లడంతో ఏలూరు జిల్లా కేంద్రం నుంచి పోస్టల్ బ్యాలెట్‌లు రాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు గందరగోళ పడ్డారు. పదిరోజుల క్రితం తాడేపల్లిగూడెంలో ఎన్నికల ట్రైనింగ్ తీసుకొన్న గణపవరం ఉద్యోగులు అక్కడ ఫారం- 12 దరఖాస్తులు సమర్పించగా అక్కడకు వెళ్లిన ఉద్యోగులకు అక్కడ బ్యాలెట్ జారీ కాలేదు. ఉంగుటూరు వస్తే ఇక్కడ బ్యాలెట్ లేదని చెప్పడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరకు రాజకీయ పార్టీ ల జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి దాపరించింది. ప్రభుత్వ ఉద్యోగుల ఓటును వ్యతిరేక ఓటుగా భావించడం వల్లే వారిని ఇబ్బంది పెట్టి వారు ఓటు హక్కు వినియోగించుకోకుండా చేయడమే ప్రధాన అజెండా సాగిందని ఉద్యోగ సంఘాల పెద్దలు ఆరోపణ చేస్తున్నారు. కాగా తాడేపల్లిగూడెంలో ఫాం-12 ఇచ్చి ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటు లేకపోతే ఉద్యోగులకు ఎక్కడ ఓటు ఉందో అక్కడ వినియోగించుకోవాలని ఆర్వో ఖాజావలి ఒక ప్రకటనలో కోరారు. అవసరమైతే ఫోన్ నెంబర్ 94910 41424లో సంప్రదించాలని కోరారు.

ఓటుకు రూ.2 వేలు

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఏమి చేయలేదని, వీరంతా వ్యతిరేకంగా ఓటు వేస్తారని వైసీపీ నేతలు భావించారు. అందుకే డబ్బులు ఎర చూపి ఓట్లు వేయించు కోవాలని పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతలు, కార్యకర్తలు పడిన తంటాలు అవిఇవి కావు. ఎలాగైనా ఓటర్లను గుర్తించి ఓటుకు రూ.2వేలు చొప్పున పంచారని గుసగుసలు వినిపించాయి.

ఓటుకు దూరంగా ఉంచాలి



ప్రభుత్వ ఉద్యోగులను ఎలాగైనే ఓటుకు దూరంగా ఉంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకే సరైన క్లారిటీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఓటు ఎక్కడ వేయాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లోకి ప్రభుత్వం నెట్టేసింది. దీనికి కారణం ఉద్యోగుల ఓట్లు అనుకూలంగా పడవనే.
- డి.శ్రీనివాసరావు, ఎస్ఏ, పెదపాడు హైస్కూల్.

ఎండలో ఇబ్బందులు పెట్టారు..



కోటదిబ్బ జూనియర్ కళాశాలకు వెళ్ళి ఓటు వేయండి అంటూ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చిం ది. నేను ఐడీ పత్రాలు తీసుకుని వెళ్ళాను. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వెయిట్ చేయించి మీకు ఓటు లేదు గణపవరం మండలం వెళ్ళి వేయండి అని చెప్పారు. ఎండలో మహిళా ఉద్యోగులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదు.
- శిరోమణి, టీచర్, గణపవరం మండలం.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం..



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకమని తెలిసి పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని గందరగోళ పరిస్థితికి నెట్టారు. ఉద్యోగులు మూకుమ్మడిగా ఓట్లు వేస్తే ఓడిపోతామనే భయం వైసీపీ నేతల్లో ఉంది. అందుకే ఈ గందరగోళం సృష్టించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలేవు. ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ ఓటు వేయాలో ఫోన్ మెసేజ్ ద్వారా తెలపాలి. ఈ అంశంపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం.
- బడేటి చంటి, ఏలూరు కూటమి అభ్యర్థి

ఎన్నికల సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం : కలెక్టర్



వట్లూరులో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్యవేణి

ఏలూరు సిటీ/ పెదపాడు/నూజివీడు టౌన్, మే 4 : జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ, కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన దెందులూరు నియోజకవర్గం పోస్టల్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో 18 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి , కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ, జేసీ లావణ్యవేణి, పాటు నూజివీడు ఆర్డీవో భవానిశంకరి, పోలీసు, రెవెన్యూ వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. కాగా జిల్లాలో తొలిరోజు 5,690 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మూడు ఎన్నికల ముచ్చట..

నిడదవోలు

నాలుగోసారి సార్వత్రిక ఎన్నికలు



రాణి రుద్రమదేవి ఏలిన పోరుగడ్డ అది.. నిరవజ్యపురంగా వినుతికెక్కి చరిత్రలో నిలిచింది. బ్రిటిష్ వారి వ్యాపారాలకు జల రవాణాలో ముఖ్య కేంద్రమది.. ఒకప్పుడు వర్తక వాణిజ్యాలకు ముఖ్యకేంద్రం అది.. ప్రస్తుతం పశ్చిమ.. తూర్పు డెల్టాలకు సాగునీరందించే గోదావరి ఒడి అది.. ఇలా చెప్పుకుంటూ నిడదవోలు చరిత్ర అంతా ఇంతా కాదు.. వందల ఏళ్ల చారిత్రక పట్టణం నిడదవోలు. 2008 వరకు కొవ్వూరు నియోజకవర్గంలో ఉండేది. ఆ తరువాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో నిడదవోలు ప్రత్యేక నియోజక వర్గంగా ఏర్పడింది.. ముచ్చటగా మూడుసార్లు 2009, 2014, 2019 సాధారణ ఎన్నికలు జరిగాయి. రెండు ఎన్నికల్లోనూ టీడీపీ విజయబావుటా ఎగురవేసింది.. ప్రస్తుతం 2019లో వైసీపీ విజయం సాధించింది. నాలుగోసారి నిడదవోలు నియోజకర్గంలో సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు హోరాహోరీ తలపడుతున్నారు. - పెరవలి

- రాణి రుద్రమదేవి ఏలిన చారిత్రక పట్టణం నిడదవోలు
- నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి వ్యవసాయాధారితమే
- 15 ఏళ్ల క్రితం అసెంబ్లీ నియోజకవర్గం ఆవిర్భావం
- రెండు సార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ విజయం
- నాలుగోసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీలు హోరా హోరీ



నిడదవోలు నియోజకవర్గం చాలా ప్రత్యేకమైనది.. ఒకనాడు జల రవాణా ముఖ్య కేంద్రంగా విలసిల్లింది.. బ్రిటిష్ పాలకుల హయాంలో నిడదవోలు ఒక వెలుగు వెలిగింది.. నేటికీ నిడదవోలు పట్టణంలో ఆ ఆనవాళ్లు మిగిలే ఉన్నాయి. వార్ఫ్ రోడ్‌లో ఎగుమతి.. దిగుమతుల కేంద్రం నేటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత క్రమేపీ జల రవాణా కనుమరుగైంది. ఇటీవల ప్రధాని మోదీ బకింగ్‌హామ్ కెనాల్‌పై జల రవాణా ప్రతిపాదన ముందుకు తీసుకురావడంతో నిడదవోలు వాసులు ఆశగా ఎదురుచూశారు. అది ప్రతిపాదన దశలోనే ఉంది.

నాలుగోసారి సార్వత్రిక ఎన్నికలు

నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 ఏళ్లు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గతంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి. నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా 2008లో అత్తిలి నియోజకవర్గం, పెనుగొండ నియోజకవర్గం రద్దు కావడంతో నిడదవోలు నియోజకవర్గం నూతనంగా ఏర్పడింది. దీంతో మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాలు అయ్యాయి. 2008లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి నిడదవోలు, తణుకు నియోజకవర్గం నుంచి ఉండ్రాజవరం, పెనుగొండ నియోజకవర్గం నుంచి పెరవలి విడివడి నిడదవోలు నియోజకవర్గంగా ఏర్పడింది. 2009లో మొదటి ఎన్నిక జరిగింది.

తొలి ఎన్నికల్లో టీడీపీ విజయ కేతనం

2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున బూరుగుపల్లి శేషారావు, కాంగ్రెస్ తరుపున జి.శ్రీనివాసనాయుడు, ప్రజారాజ్యం తరపున ఆర్.గజపతి కుమార్ రాజు (జెడ్‌రాజు) పోటీ చేశారు. 5,766 ఓట్ల మెజారిటీతో శేషారావు విజయం సాధించారు. రాష్ట్ర విభజన తరువాత 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన బూరుగుపల్లి శేషారావు రెండోసారి విజయం సాధించారు. వైసీపీ తరుపున తరపున పోటీ చేసిన రాజీవ్‌కృష్ణపై 6,359 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన జి.శ్రీనివాసనాయుడు, టీడీపీ తరపున బూరుగుపల్లి శేషారావు, జనసేన తరపున అతికాల రమ్యశ్రీ పోటీ చేశారు. శ్రీనివాసనాయుడు 21,688 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ప్రధాన పార్టీల హోరా హోరీ

ప్రస్తుత ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి తరపున జనసేన అభ్యర్థి కందుల లక్ష్మి దుర్గేష్ ప్రసాద్, వైసీపీ తరుపున జి.శ్రీనివాసనాయుడు పోటీ చేస్తున్నారు. మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. హోరా హోరీగా జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో దుర్గేష్ ఒక వైపు, శ్రీనివాసనాయుడు మరోవైపు, ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఓటర్ల సంఖ్య ఇలా..

ప్రాంతం	పురుషులు	మహిళలు	మొత్తం
నిడదవోలు అర్బన్	16584	18528	35112
నిడదవోలు రూరల్	28722	29492	58216
ఉండ్రాజవరం	30366	31995	62362
పెరవలి	28563	29142	57706
మొత్తం	1,04,235	1,09,157	2,13,396

వ్యవసాయాధారిత నియోజకవర్గం



నిడదవోలు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఉండ్రాజవరం, పెరవలి మూడు మండలాల్లో వరి, కూరగాయల సాగు అధికం. భారీ పరిశ్రమలు ఏమీ లేవు. మూడు మండలాల్లోనూ అన్ని రకాల పంటలు పండిస్తారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ ద్వారా జిల్లాలోని ప్రధాన కాలువలకు గోదావరి జలాలు అందుతున్నాయి. పశ్చిమ డెల్టాకు ముఖద్వారంగా నిడదవోలు నియోజకవర్గం విరాజిల్లుతుంది.

పరిసర గ్రామాలకు నిడదవోలు పట్టణం ప్రధాన సెంటర్. ఇక్కడి రైల్వే జంక్షన్ తణుకు, తాడేపల్లిగూడెం రైలు మార్గాలను వేరు చేస్తుంది. విజ్జేశ్వరం నుంచి బయలు దేరిన కాలువ వెంబడి గతంలో పడవ ప్రయాణాలు విరివిగా జరిగేవి. జల వాణిజ్యం కూడా ఈ ప్రాంతంలో ఎక్కువగా అభివృద్ధి చెందిందని చెబుతారు. కాలువ గట్టునే గల చిన్న కాశీ రేవు ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ సుమారు చిన్న పెద్ద 30 ఆలయాలు ఉన్నాయి. పట్టణంలో గణపతి సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు, గణేష్ చౌక్, బస్టాండ్ సెంటర్లు పేరు గాంచినవి. నిడదవోలుతో పాటు పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో వరి, చెరకు, కోకో, కొబ్బరి, కూరగాయలు ప్రధాన పంటలుగా పండిస్తారు. ఇక్కడ విద్యా సంస్థలు ఆసుపత్రులు కూడా ఎక్కువ. నిడదవోలు పట్టణం ఆయిల్ ఇంజన్ల అమ్మకాలు, మరమ్మతులకు ప్రసిద్ధి.

ఒకటికి.. ఒక బ్యాలెట్ బాక్స్..



పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నికల నిర్వహణకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు అందుబాటులోకి వచ్చాయి. బ్యాలెట్ బాక్సులు కనుమరుగయ్యాయి. అంతకు ముందు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు జరిగినప్పుడు బాక్సులు ఉండేవి. పోటీ చేసిన అభ్యర్థులందరికీ వేర్వేరుగా బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేసేవారు. 1952, 1957 ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ఒక్కో బ్యాలెట్ బాక్సు ఏర్పాటు చేశారు. దీనివల్ల బాక్సుల తయారీ ఖర్చు అధికం కావడం, బాక్సులను భద్రపర్చటం కష్టం కావడంతో ఈ విధానం మార్చేశారు. 1962 నుంచి అభ్యర్థులందరికీ ఒకే బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈవీఎంలు రావటంతో బాక్సుల పద్ధతి లేదు. - ముదినేపల్లి

మీ ఓటే.. మీ భవిష్యత్

అభ్యర్థుల కొత్త నినాదం



మీ ఓటు.. మీ భవిష్యత్.. ఇది ఓటర్లకు అధికారుల అవగాహన కార్యక్రమం కాదు. ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులు కొత్త నినాదం అందుకున్నారు. గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అనే పాత పురాణంతో విసుగెత్తించే దాని కంటే ఓటు ప్రాధాన్యం చెప్పడం మంచిదనుకున్నారో.. ఏమో.. మేము మండుటెండల్లో సైతం మీ గ్రామానికి, మీ వీధికి, మీ ఇంటి వద్దకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నాం. అంటే మీ ఓటు ఎంత విలువైందో తెలుసుకోండి.. ఓటు హక్కును వినియోగించుకోండని అంటూఓటర్లకు పిలుపునిస్తున్నారు. ఈ ఎన్నికలు మీకు, మీ పిల్లల భవిష్యత్‌కు గీటు రాయి అంటూ ఉపన్యాసాలు దంచుతున్నారు. - ముదినేపల్లి

అస్మదీయులకూ తాయిలాలు..



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు అసమ్మతి నాయకులకు తాయిలాల వల వేస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి రప్పించుకుంటున్నారు. అధికారంలో ఉన్న సమయంలో విభేదాలతో దూరంగా ఉన్న వారిని పిలిపించి ఒక్కో నాయకుడికి రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ముట్టచెబుతున్నట్లు సమాచారం. పెంటపాడు మండల స్థాయి ప్రజా ప్రతినిధి పదవి ఆశించి భంగపడిన నాయకుడిని ఈ ఎన్నికల్లో తన తరపున ప్రచారం చేసేందుకు భారీ మొత్తం ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ తరహా తాయిలాల వ్యవహారంపై ప్రస్తుతం నియోజకవర్గంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. - తాడేపల్లిగూడెం రూరల్

పసందైన విందు..



ఎన్నికల వేళ పార్టీపై అభిమానాన్ని చాటుకునేందుకు పలువురు నాయకులు ప్రచారానికి వెళుతున్నారు. వారికి అభ్యర్థులు పసందైన విందు భోజనం, అల్పహారాలు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా వార్డు, గ్రామాలకు గాని విచ్చేయగానే అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తరువాత మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు ఇస్తున్నారు. మధ్యాహ్నం గ్రామంలో ఇద్దరు, ముగ్గురు లేదా పార్టీ శ్రేణులంతా చందాలు వేసుకుని ఒక చోట భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో శాకాహార, మాంసాహార వంటకాలను పోటాపోటీగా పెడుతున్నారు. ఈ తరహా ఏర్పాట్లలో కూటమి పార్టీల వారే ముందజులో ఉన్నారు. ఎండకాలం కావడంతో మాంసాహారంపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. - నరసాపురం

ఆ ఫోన్ ఆపండిరోయ్..



పోలింగ్ సమయం దగ్గరపడుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు సోషల్‌మీడియా ద్వారా ఒకరి పై ఒకరు పదునైన విమర్శలు చేసుకుంటూ హోరెత్తిస్తున్నారు. అయినా పరవాలేదు. సోషల్ మీడియా, ఫోన్‌కాల్స్‌తో పాటలు, ప్రసంగాలు, మేనిఫెస్టో అంశాలపై ఊదరగొట్టేస్తున్నారు. ఫోన్ రింగ్ అయితే భయపడే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నికల్లో ప్రధానపార్టీల అభ్యర్థులు సెల్‌ఫోన్ ప్రచార అస్త్రాలుగా వినియోగించుకుంటున్నారు. నేను మీ ఫలానా పార్టీ అభ్యర్థిని, ఓటువేసి ఆశీర్వదించాలంటూ ఫోన్‌లో అభ్యర్థిస్తున్నారు. - ఏలూరు రూరల్

మహిళా సంఘాల సీఏలకు
బెదిరింపులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తోంది. వైసీపీ మహిళా నేతలు కూడా ఇప్పుడు బెదిరింపు రాజకీయాలకు తెర తీశారు. పెనుమంట్ర మండలంలో ఇద్దరు అధికార పార్టీ మహిళా నేతలు డ్వాక్రా సంఘాల పేరుతో రుణం తీసుకున్నారు. వారే తిరిగి రుణాలు చెల్లిస్తున్నారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకుని డ్వాక్రా సంఘాల సీఏలను ఒప్పించారు. సంఘాల అనుమతితో రుణాలు పొందారు. వాటిని తిరిగి చెల్లిస్తూ వచ్చిన మహిళా నేతలు ఇప్పుడు అధికార పార్టీ కోసం ఎన్నికల ప్రలోభాలకు దిగారు. వైసీపీకి అనుకూలంగా డ్వాక్రా మహిళలను ఒప్పించకపోతే రుణాలు తీసుకున్న సంగతిని బయట పెడతామంటూ బెదిరిస్తున్నారు. దాంతో కొందరు డ్వాక్రా సంఘాల సీఏలు హడలిపోతున్నారు. మరోవైపు డ్వాక్రా సీఏలతో ఒక మహిళా నేత సమావేశమయ్యారు డ్వాక్రా మహిళలను వైసీపీ అనుకూలంగా వ్యవహరించేలా చూసేందుకు తాయిలాలు ఇచ్చారు. ఒక్కో సీఏకి రూ. 5వేల వంతున ఇచ్చినట్టు సమాచారం. మిగిలిన గ్రామాల్లో సమావేశం ఏర్పాటుచేసి సీఏలకు తాయిలాలు ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల ముఖ్యులకు ఎర వేయనున్నారు. ఇప్పటికే భీమవరంలో డ్వాక్రా సభ్యులకు తాయిలాలు అందాయి. ఆచంటలో ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ప్రచార అనుమతి చూపమంటే..
ఎమ్మెల్యే రాస్తారోకో

పెదవేగి, మే 4: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పెదవేగిలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బి.నర్సయ్య ప్రచార వాహనాలను ఆపి అనుమతి పత్రాలను అడిగారు. దీనిపై కొఠారు అబ్బయ్యచౌదరి ప్రచారం చేసుకోవడానికి అన్ని అనుమతులు ఉన్నాయి. ప్రతిసారి ఆపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిని దిగ్బంధనం చేసి రాస్తారోకోకు దిగారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో వాహనాలు నిలిచిపోయి దాదాపు గంటపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల ఫ్లయింగ్ అధికారి నర్సయ్య క్షమాపణ చెప్పడంతో కొఠారు శాంతించారు.

పంట కాల్వలో తూడు తొలగించి..

కూలీ అవతారమెత్తిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల





పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. మట్టపర్రులో ఆయన శనివారం రైతు కూలీ అవతారం ఎత్తారు. కూలీలతో కలసి పంట కాల్వలో తూడు తొలగించారు. మాసూళ్ల పనుల్లో రైతులకు సహకరించి ధాన్యం పట్టుబడి పట్టారు. బంటా కూలీలతో కలిసి ధాన్యం బస్తాలను మోశారు. కూలీలతో కలసి ఎమ్మెల్యే చకచకా వ్యవసాయ పనులు చేయడం రైతులను విశేషంగా ఆకట్టుకుంది. - పోడూరు



పొలిటికల్ బెట్టింగ్

- రంగంలో దిగిన పందెంరాయుళ్లు
- కూటమి విజయంపై మొగ్గు

ఆకివీడు / ద్వారకాతిరుమల, మే 4: ఎన్నికల ఫలితాలపై అప్పుడే పందెంగాళ్ల కాళ్లు దువ్వుతున్నారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల విజయావకాశాలపై అంచనా వేసుకుంటున్నారు. జనం నాడిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పందెం కాయడంలో కమీషనుదారులు కీలకంగా మారారు. నియోజకవర్గ కేంద్రాలు, పల్లెల్లోని ప్రధాన కూడళ్లలో సంచరిస్తున్నారు. ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉన్న నియోజకవర్గాలనే ఎన్నుకుంటున్నారు. ముఖ్య నాయకులు పోటీచేసే చోట పందెం కాసే పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జిల్లాలో ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలపై పందెం రాయుళ్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో టీడీపీ మెజార్టీపైనే ఎక్కువ పందేలు జరుగుతున్నాయి.

ఐదు శాతం కమీషన్

పందేలు కాయడంలో పశ్చిమ గోదావరి జిల్లా పెట్టింది పేరు. క్రికెట్, కోడి పందేలు గురించి చెప్పనవసరం లేదు. అంతక మించి ఎన్నికల పందేలు కాస్తుంటారు. రెండు వైపులా పందెం గాళ్లకు మధ్యవర్తిత్వం వహించడంలో కమీషన్‌దారులదే హవా. దళారులకు 5 శాతం కమీషన్ ఉంటుంది. దీంతో కమీషన్‌దారులు కూడా ప్రజల నాడిని తెలుసుకొనేందుకు నియోజకవర్గాలలో పర్యటిస్తున్నారు.

కూటమి వైపు ఎక్కువ పందేలు

ఈసారి లక్షలు, కోట్లలో పందేలు కాస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో పందేలు కాసిన పందేలరాయుళ్లు ఇక్కడ తిష్ట వేశారని చెబుతున్నారు. అక్కడ కాంగ్రెస్ గెలుస్తుందని పందేలు కాసి సొమ్ములను కైవసం చేసుకున్న వారు ఇక్కడ తెలుగుదేశం కూటమి గెలుస్తుందని లక్షలాది రూపాయలతో పందేలు కాస్తున్నారు. వైసీపీ గెలుస్తుందని పందెం కాసేవాళ్లు అరుదుగా కనిపిస్తున్నారని పందెంరాయుళ్లు చెబుతున్నారు. దీంతో పందేలరాయుళ్లు సైతం నిరాశతో ఉన్నారని, వైసీపీ గెలిస్తే 4, 5 రెట్లు ఎక్కువ ఇస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మొత్తం మీద వైసీపీ గెలుస్తుందని పందేలు కాసేవారు తక్కువగా ఉన్నారని, దీంతో టీడీపీ కూటమి విజయం ఖాయమని అంచనా వేస్తున్నారు.

సాయుధ బలగాల కవాతు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల సాయుధ దళాల కవాతు నిర్వహించి ప్రజలకు అవహాన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి సహకరించాలని ప్రజలకు సూచిస్తున్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో ఏటీఎంలు, మసీదు ప్రాంతాల్లో పోలీసులు పరిశీలిస్తున్నారు. - ఏలూరు క్రైం







ఏలూరు రూరల్ మండలం, గ్రామాల్లో సాయుధ దళాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



కూల్ : శీతల పానీయం తాగుతున్న చంద్రబాబు



విజయోస్తు : హారతి ఇస్తున్న మహిళ



ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఏలూరు జిల్లా నూజివీడు ప్రజాగళం సభలో పాల్గొన్నారు.సభకు పెద్దసంఖ్యలో మహిళలు, యువత, అభిమానులు విచ్చేశారు. యువత విక్టరీ చూపుతూ ఉత్సాహం నింపారు.

ఫుల్ జోష్





ఒక ఫొటో తీసుకుంటా..









విజయం మనదే : సభలో విక్టరీ సంకేతం చూపుతున్న చిన్నారులు, మహిళలు

50 ఏళ్లుగా ఆ..రెండు కుటుంబాలదే హవా..



జిల్లా రాజకీయాల్లో నరసాపురానికి ఓ ప్రత్యేక ఉంది. ఈ నియోజకవర్గం నుంచి గెలుపుపొందిన ఎమ్మెల్యేలుగా మంత్రులుగా పని చేశారు. ఈ కారణంగా జిల్లా రాజకీయాల్లో కూడా చక్రం తిప్పారు. గడిచిన 50 ఏళ్ళ నుంచి ఇక్కడ రాజకీయం అంతా రెండు కుటుంబాల మధ్యే సాగింది. ఆందులో ఒకటి కొత్తపల్లి సుబ్బారాయుడు. మరొకరు పరకాల శేషావతారం. 1967 నుంచి 82 వరకు నరసాపురం రాజకీయాల్లో పరకాల కీలకంగా వ్యవహరించారు. తొలిసారి 1962 ఆయన కమ్యూనిస్టు అభ్యర్థిపై పోటీ చేసి విజయం సాధించారు. తరువాత 67ఎన్నికల్లో ఓడిపోయినా...నియోజకవర్గ రాజకీయాలను వీడలేదు, తిరిగి 72, 78 ఎన్నికల్లో విజయం సాధించారు. 1982లో ఆయన ఆకస్మిక మృతితో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఆయన సతీమణి కాళికాంబ పోటీ చేసి స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. అయితే 83 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు.తరువాత పరకాల కుటుంబానికి వారసుడుగా ప్రభాకర్ విచ్చేస్తారు. ఆయన 1992 నుంచి ఆయన కాంగ్రెస్‌లో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. 1994 ఎన్నికల్లో ఆయన కొత్తపల్లి చేతిలో ఓటమి చెందారు. 96 ఉప ఎన్నికల్లో కొత్తపల్లి జానకీరామ్ చేతిలో మరోసారి ఓటమి చెందారు. ఆ తరువాత ఆయన నియోజక వర్గ రాజకీయాలకు దూరమయ్యారు. దీంతో పరకాల కుటుంబ రాజకీయం నియోజకవర్గంలో తగ్గింది. ఇటు కొత్తపల్లి 1981లో రాజకీయాల్లో వచ్చారు. కౌన్సిలర్‌గా గెలిచి 83లో పురపాలక వీసీ అయ్యారు. 89లో తొలిసారి ఆసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009 వరకు ఆయన హవా కొనసాగింది. ఇలా 30 ఏళ్లు కొత్తపల్లి కుటుంబం రాజకీయాల్లో చక్రం తిప్పింది. 2012 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరువాత పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 2014లో ఎన్నికల్లో పోటీ చేసినా విజయం సాధించ లేదు. 2019, 2024 ఎన్నికల్లో టిక్కెట్ చిక్కలేదు. అయినప్పటికీ నియోజకవర్గ రాజకీయాల్లో కొత్తపల్లి హవా తగ్గలేదు. ఇప్పటికే నియోజకవర్గ రాజకీయాల్లో కొత్తపల్లికి ఒక ప్రత్యేక స్థానం ఉంది . -నరసాపురం



క్లాత్ బ్యానర్లు రాస్తున్న ఆర్టిస్ట్‌లు (ఫైల్)

ఎన్నికలంటే మూడు నెలలు పనుండేది..

ఎన్నికలంటే ఆరోజుల్లో పండుగలా ఉండేది.. పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపల్, స్థానిక సంస్థలు ఇలా ఎన్నికలు ఏవైనా 2 నుంచి 3 నెలల పాటు చేతినిండా పని ఉండేదని పలువురు ఆర్టిస్టులు చెబుతున్నారు. గతంలో ఎన్నికలు వస్తే క్లాత్ బ్యానర్లు, గోడలపై అభ్యర్థుల పేర్లతో ప్రకటనలు రాయడం వంటివి ఎన్నో పనులు ఉండేవి. ఇపుడు అటువంటి పరిస్థితి లేదని డిజిటల్ ప్రచారం వచ్చి తమ ఉపాధి మార్గాలను దెబ్బకొట్టిందని చెబుతున్నారు. 2004వ సంవత్సరానికి ముందు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ఆరిస్టులకు అందరికీ ఉపాధి లభించేది. ఆ రోజుల్లో క్లాత్ బ్యానర్లు రాస్తే రూ.80 నుంచి 120 వరకూ (సైజును బట్టి రంగులను బట్టి) ఇచ్చేవారని, రాత్రి పగలు కష్టపడితే రోజుకు ఒకొక్కరూ 10 బ్యానర్లుపైనే రాసేవారమని పాలకొల్లుకు చెందిన ఆర్టిస్ట్ కడలి శ్రీనివాస్ చెప్పారు. అలాగే వీధుల్లో గోడలపైన ప్రకటనలు రాయడం, ఎన్నికల తేదీ, ఎన్నికల గుర్తు వంటివి రాసేవారమని ఇందుకు సైజును బట్టి బోర్డుకి రూ రూ.50 నుంచి రూ.80 ఇచ్చేవారని, ఒకొక్కరూ సుమారుగా 12 నుంచి 15 గోడలపై బోర్డులు రాసేవారమని ముగడ నాగేశ్వరరావు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో సుమారు 500 మంది వరకూ పెయింటర్లు, ఆర్టిస్ట్‌లు ఉపాధి పొందే వారమని సీనియర్ ఆర్టిస్ట్ జీఎస్ఎన్ చెప్పారు. నేడు కనీసం ఒక్క బ్యానరు కానీ, గోడలపై ప్రకటన కానీ రాయడానికి ఎవరూ ఆర్డర్ ఇవ్వలేదని చెబుతున్నారు. - పాలకొల్లు అర్బన్

ఈ వయసులో ఏడిపిస్తారా..!

పింఛన్ లబ్ధిదారుల ఆవేదన
బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు.. గంటల తరబడి అవస్థ
మండుటెండల్లో వృద్ధుల పాట్లు



ద్వారకాతిరుమలలో పింఛన్ కోసం వెళుతున్న వృద్ధురాలు

పెన్షన్ సొమ్ముల కోసం వృద్ధులు మండుటెండల్లో ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం కూడా బ్యాంకుల రద్దీ తగ్గక వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడ్డారు. క్యూలైన్లలో నిలబడి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆపసోపాలు పడి పింఛను సొమ్ములు తీసుకున్నారు.ఇప్పటి వరకూ బ్యాంకు లావాదేవీలు చేయనివారు తమఖాతాలు రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చింది. దానికి సర్వీసు చార్జీలు అదనంగా చెల్లించాల్సి వచ్చింది.

బ్యాంకుల వద్ద ఆపసోపాలు

ద్వారకాతిరుమల : ఓపిక లేకపోయినా అవ్వాతాతలు పెన్షన్ సొమ్ముకోసం బ్యాంక్‌ల వద్ద బారులు తీరుతున్నారు. ఎండ, ఉక్కబోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఈకేవైసీ కాలేదని, ఆధార్ లింక్ కాలేదని ఇలా కొన్ని కారణాలతో కొందరికి పింఛను అందడం ఆలస్యం అయ్యింది. బ్యాంకుల్లో రద్దీ పెరగడంతో గంటల తరబడి వృద్ధులు వేచి ఉండి పింఛను తీసుకుని ఆపసోపాలు పడుతూ ఇళ్లకు చేరకున్నారు.

25 కిలోమీటర్ల దూరం నుంచి వస్తే..



కుక్కునూరు : కుక్కునూరు మండల కేంద్రానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన గూడూరు భాగ్యమ్మ ఉదయం 8 గంటలకే బ్యాంక్‌కు చేరింది. బ్యాంక్‌లో రద్దీ దృష్ట్యా ఆమె పింఛన్ సొమ్ము అందుకునే సరికి మధ్యాహ్నం 12 గంటలైంది. పింఛన్ సొమ్ము తెచ్చుకునేందుకు మండుటెండకు వృద్ధులు అల్లాడిపోతున్నారు.

మా బాధలు దేవుడికి తెలుసు..

ఇరగవరం : జగన్మోహన్‌రెడ్డి ఓట్ల కోసం మండు వేసవిలో తమ జీవి తాలతో ఆటలాడు కుంటున్నారని లబ్ధిదారులు మండిపడ్డారు. బ్యాంకులో జమచేసిన పింఛను సొమ్ము తీసుకోవడానికి మూడోరోజు శనివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచే బ్యాంకుల వద్ద పడి గాపులు కాశారు.

• పింఛన్ పంపిణీలో రాజకీయమా



పింఛను తీసుకునేందుకు బ్యాంకు వద్దకు రెండుసార్లు వచ్చాను. రద్దీగా ఉండడంతో వెళ్లిపోయా.శనివారం పింఛను తీసుకున్నాను. గతంలో మాదిరిగా సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి ఇస్తే మాకు ఈ ఇబ్బందులు ఉండేవి కాదు. మూడు కిలోమీటర్లు నడిచి వచ్చి పింఛను తీసుకున్నా. రాజకీయం చేసి మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు.

కొల్లి చిట్టమ్మ, సజ్జాపురం

• నిలబడే ఓపిక కూడా లేదు..



ఎక్కువసేపు నిలబడలేను..నిలబడితే కళ్లు తిరిగి ఆయాసం వస్తుంది. అయినా రెండు సార్లు సచివాలయానికి వెళ్తే బ్యాంకుకు వెళ్ళమని చెప్పారు. మా మనవడి సాయంతో బ్యాంకుకు వచ్చాను. లోపల పెద్ద లైన్ ఉండడం వలన అక్కడ ఉండలేక బయటకు వచ్చేశాను. బ్యాంకు ఖాతా వినియోగించి చాలా ఏళ్ల అవుతేతుంది. అధికారులు ఏమంటారో..?ఎప్పటికి ఇస్తారో తెలియదు. పింఛను తీసుకోవడానికి మేము పడే బాధలు దేవుడికే తెలుసు.

-ఒరగంటి పెద్దరాజు, పాతవూరు తణుకు



ద్వారకాతిరుమలలో ఓ బ్యాంక్ వద్ద పింఛన్‌దార్లు



పోలవరం స్టేట్ బ్యాంకులో రద్దీ

అడవి బిడ్డలకు అవస్థలు

పోలవరం, మే 4 : పోలవరం మండలంలో గెడ్డపల్లి పంచాయతీ పాపి కొండల అభయారణ్యంలో ఉండడం వల్ల ఆ గ్రామం నుంచి సుమారు 30 కిలోమీటర్లు అడవిమార్గంలో ప్రయాణించి కన్నాపురం బ్యాంకు చేరు కోవ లసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇబ్బందులు పడి బ్యాంకుకు చేరినా ఖాతాలు రెన్యువల్ చేసుకోవాడానికి మళ్లీ స్వగ్రామాలకు వెళ్లి సోమవారం రావాలని బ్యాంకు అధికారులు సూచించడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. చేగొండపల్లి పంచాయతీ మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాలు పోల వరం గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో పాపికొండల అభయార ణ్యంలో ఉన్నాయి.పది కిలోమీటర్లు కాలినడకన, పది కిలోమీటర్లు ఆటోలపై అదనపు చార్జీలు చెల్లించి బ్యాంకులకు చేరుకోవాలని గిరిజన వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో గ్రామాలైన కృష్ణారావుపేట, బంగారమ్మపేట, యడ్లగూడెం,కొత్తరామయ్యపేట గ్రామాల నుంచి మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడ పల్లి గ్రామాల నుంచి 12 కిలోమీటర్ల దూరం నుంచి, ఎల్ఎన్‌డీ పేట సమీ పంలో ఉన్న కొండ్రుకోట పునరావాస కాలనీ నుంచి 17 కిలోమీటర్ల దూరం నుంచి పోలవరం స్టేట్ బ్యాంకుకు చేరుకోవలసిన పరిస్థితులు నెల కొన్నాయి. మండుతున్న ఎండల్లో బ్యాంకుకు వెళ్లలేక ఇళ్ళకే పరిమితమ య్యారు. సొమ్ములు అవసరమైనవారు సమీపంలో ఉన్న ప్రైవేటు బ్యాంకు సేవా కేంద్రాల్లో కమీషన్లు వెచ్చించి పింఛను సొమ్ములు డ్రా చేసుకున్నారు.



పోలవరం మండలం దొండపూడి ఆంధ్రాబ్యాంకులో రద్దీ

ఉద్యోగుల జీతాల చెల్లింపునకు చట్టబద్ధత కల్పించాలి

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారే బాధ్యత వహించాలి
ఆర్థిక బకాయిలన్నింటినీ 'పారు బకాయి'కింద రద్దు చేస్తారేమోనని ఉద్యోగుల్లో ఆందోళన
ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక సమావేశం



సమావేశంలో సంఘీభావం తెలియజేస్తున్న ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 4 : ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన జీతభత్యాలు, పెన్షన్లు, తదితర ఆర్థిక అంశాలకు చట్టబద్దత కల్పించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సాధారణ ఎన్నికల విధులకు ఉద్యోగ సిబ్బందిని నియమించిన నియోజక వర్గ రిటర్నింగ్ అధికారే సంబంధిత ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కునేలా వ్యక్తిగత బాధ్యత తీసుకునేలా భారత ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాలతో జరిపే చర్చలకు హాజ రయ్యే వివిధ శాఖల ప్రతినిధులను రెండేళ్లకోసారి నేరుగా సంబంధిత ఉద్యోగులే ఎన్నుకునేలా ఏర్పాట్లు ఉంటే ఉద్యోగ సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయన్నారు. ఐక్యవేదిక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ సమావేశం శనివారం ఏలూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, పెన్షనర్లు హాజర య్యారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన 12 అంశాలపై చర్చావేదిక నిర్వహించారు. తొలుత ఇవే అంశాలను మీడియా సమావేశంలోనూ వివరించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక అంశాలకు చట్టబద్దత కల్పించినపుడు, ప్రభుత్వం దానిని ఉల్లంఘిస్తే ఐపీసీ నిబంధనల మేరకు ప్రాసిక్యూట్ చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక చెల్లింపులకు చట్టబద్దత లేకపోవడం వల్లే 15వ తేదీ దాటినా జీతాలు, పెన్షన్లు వస్తూనే ఉన్నాయన్నారు. ఉద్యోగ సంఘాల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల ప్రభుత్వం నాలుగు స్థంబాలాట ఆడుతోందని, ఈ పరిస్థితి వల్ల కొన్ని సంఘాలు పాలాభిషేకాలకు, చాయ్ పే చర్చలకు పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయమన్నా దిక్కులేదని, కనీసం సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగినా స్పందన లేదన్నారు. జీఎస్టీ వల్ల ప్రభుత్వానికి పన్నురాబడి పరిధి లేదా పన్నురేటును పెంచుకునే అవకాశం లేనందున ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.20-25 వేలకోట్ల బకాయిలన్నింటినీ ఒకేసారి 'పారు బకాయి' కింద రద్దు చేస్తారేమోనన్న ఆందోళన ఉద్యోగ, పెన్షనర్లలో నెలకొందని వివరించారు.ఉద్యోగుల సమస్యలపై నిరసన తెలియజేద్దామన్నా నాయకులను గృహ నిర్బంధాలు, పోలీసు నోటీసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల జీతం నుంచి నెలనెలా మినహాయించుకుంటున్న ఆరోగ్య బీమా సొమ్ము, ప్రభుత్వ వాటా కలిపితే ఏడాదికి రూ.450 కోట్లుగా ఉందని, ఇంత పెద్దమొత్తంలో నిధులు వున్నా ఉద్యో గులకు ఈహెచ్ఎస్ వైద్యసేవలను పెయిడ్ సర్వీసుగా కాకుండా, సామాన్యులకు ఉచితంగా అంద జేసే ఆరోగ్యశ్రీ సేవలుగా దిగ జార్చారని మండిపడ్డారు. రేషనలైజేషన్‌తో పెద్దసంఖ్యలో టీచరు పోస్టులను రద్దు చేశారని, మన రాష్ట్ర సరిహద్దుల్లో పొరుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం వారివారి మాతృ భాషల్లో బోధన కోసం ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తోన్న ఏపీ ప్రభుత్వం, ఇక్కడమాత్రం మాతృభాషలో పాఠశా లలను నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. ఐక్యవేదిక సమావేశాలు ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసమేనని, తమకు యజమాని ప్రభుత్వమే తప్ప రాజకీయ పార్టీలు కాదన్నారు. ఎన్నికల నియమావళి వున్నా ఉద్యోగులు సమావేశాలు నిర్వహించు కోవడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని, ఎన్నికల నియామవళి రాజకీయ పార్టీలకే పరిమితమని పౌరులకు, ఉద్యోగులకు వర్తించబోదని వివరించారు. అంతర్గత సమావేశాలకు ఎవరినుంచీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 6న నిర్వహించే స్టీరింగ్ కమిటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ చర్చావేదికలు ఎన్నికల అనంతరం ఈ నెల 13న నిలిచిపోయేవి కావని, నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఐక్యవేదిక సెక్రటరీ జనరల్, ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీపఠాన్ మాట్లాడుతూ సీపీఎస్ కంటే జీపీఎస్ మరింత భయంకరమైనదన్నారు. కో-చైర్మన్ కరణం హరికృష్ణ, వైస్‌చైర్మన్లు కేదారేశ్వరరావు, రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు, కరిమి రాజేశ్వరరావు, ప్రసాద్, ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అప్పారావు,గోవిందరావు, శేషుకుమార్, రామకృష్ణ, సుందరయ్య పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ఏలూరు క్రైం, మే 4 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నాటుసారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. శనివారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు,జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబి పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయ దారులపై 4 కేసులు నమోదులు చేసి వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2700 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి 2 కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 10 కేసులు నమోదు చేసి 66.36 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 16 కేసులలో 12 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.

11న భీమవరంలో అమిత్‌షా రోడ్‌షో



భీమవరం రూరల్, మే 4 : భారతీయ జనతాపార్టీ అగ్ర నాయకుడు అమిత్‌షా ఎన్నికల ప్రచారం నిమిత్తం ఈనెల 11వ తేదీన భీమవరం విచ్చేస్తున్నట్లు నరసాపురం పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రకటించారు. శని వారం భీమవరంలోని వర్మ తన నివాసంలో విలేకరు లతో మాట్లాడారు. అమిత్ షా 11వ తేదీ సాయంత్రం భీమవరం రోడ్‌షోలో పాల్గొంటారని తెలిపారు. ఈకార్య క్రమానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.జిల్లా లోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల ఉమ్మడి అభ్య ర్థులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకు లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ క్రమశిక్షణ విభాగం ఛైర్మన్ పాకా వెంకట సత్యనా రాయణ, తపన చౌదరి, తదితరులు ఉన్నారు.

తణుకులో నేడు నారా రోహిత్ ఆత్మీయ సమావేశం

తణుకు, మే 4 : సినీ హీరో నారా రోహిత్ 5వ తేదీ ఆదివారం తణుకులో పర్యటించనున్నారు. తణుకు కమ్మ కళ్యాణ మండపం లో సాయంత్రం యువతతో ఆత్మీయ సమావేశంలో పాల్గొం టారు.కార్యక్రమంలో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ, యువ నేత ఆరిమిల్లి నిఖిల్ రత్న ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని టీడీపీ కార్యాలయం ప్రకటనలో తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలి
ఎస్పీ ప్రశాంతి



ఏలూరు క్రైం, మే 4 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహక రించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లా ప్రజలను ఒక ప్రకటనలో కోరారు. ఒక పార్టీపై ఉన్న అభిమానంతో ఎదుటి పార్టీ వారిని విమర్శించడం కాని, అసత్య ప్రచారాలు చేయడం వారి మనోభావాలు దెబ్బతినే విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఎన్నికల ర్యాలీలలో 18 ఏళ్ళలోపు పిల్లలతో ప్రచారం చేయించ రాదన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే వారి బంగారు భవిష్యత్తు పాడవుతుందని, భవిష్యత్తులో విదే శాలకు వెళ్ళాలంటే ఇబ్బందులు పడతారన్నారు. ఎన్నికల సమయంలో నమోదు చేసే క్రిమినల్ కేసులు ఉన్న వారిపై రౌడీ షీట్లను ఓపెన్ చేస్తామన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే కూటమి ధ్యేయం

» ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల

నిడమర్రు/ఉంగుటూరు, మే 4 : అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ధ్యేయంగా మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ఉదయం నిడమర్రు మండలం భువ్వనపల్లిలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అధోగతి పాలైందని, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రైతుల పాలిట శాపంలా తయారుకానుందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ చట్టం రద్దు చేస్తామన్నారు. దెబ్బతిన్న ఆక్వా రంగంకు పూర్వ వైభవం తీసుకొనివచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. తనకు గాజుగ్లాసు గుర్తుపైన, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిలు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మహిళలు పెద్దఎత్తున హాజరై ధర్మరాజుకు హారతులిచ్చారు.



భువ్వనపల్లిలో పత్సమట్ల ధర్మరాజు ప్రచారం

ఉంగుటూరులో కమెడియన్ పృథ్వీరాజ్ ప్రచారం..

ఉంగుటూరు మండలంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన స్టార్ క్యాంపెనర్, కమెడియన్ పృథ్వీరాజ్ ఓటర్లకు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని ఉంగు టూరు, కైకరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్, సర్పంచ్‌లు సలగాల గోపి, బి.సింధు పాల్గొన్నారు.



ఉంగుటూరులో పృథ్వీరాజ్ ప్రచారం

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సిద్ధం

» ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మే 4: ప్రజా వ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు 28వ డివిజన్ బీడీ కాలనీలో శనివారం ప్రజాసంకల్పయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ మేనిఫెస్టో పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని వ్యవహరిస్తున్న తీరుపట్ల ప్రజలు విసుగు చెందారన్నారు. ఏనాడూ ప్యాలెస్ నుంచి బయటకు రాని ఎమ్మెల్యే ఎన్నికలు వచ్చేసరికి ప్రజలు గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. మళ్లీ ఓట్ల పోలింగ్ తరువాత కనిపించడని అన్నారు. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారంలోనే బడేటి కుటుంబం ఉంటుందన్న విషయం మీకు తెలిసిందే అన్నారు. మా అన్న మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఎలా ప్రజాసేవలో ఉండేవారో తాను కూడా అలాగే సేవ చేస్తాననే విషయం గత ఐదేళ్ళ నుంచి మీరు చూస్తున్నారని అన్నారు. ఆలోచించి విజ్ఞతతో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, ఎంఆర్‌డీ బలరామ్, కొట్టు మనోజ్, పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేటర్ తంగిరాల అరుణసురేష్, రెడ్డి నాగరాజు, కాశీ నరేష్ పాల్గొన్నారు.



ఏలూరు 28వ డివిజన్ ప్రజాసంకల్ప యాత్రలో బడేటి చంటి



బోయగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న సొంగా

జగన్ పాలనలో దళితులు మోసపోయారు

» చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, మే 4: జగన్ పాలనలో దళితులు మోసపోయా రని, సంక్షేమం వేరు, అభివృద్ధి వేరని సంక్షే మం కొంతమందికే వస్తుందని, అభివృద్ధి అందరికి ఉపయోగప డుతుందని చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం చింతలపూడి నగర పంచాయతీలో మోడల్ కాలనీ, ముదిరాజుల కాలనీ, బోయగూడెం, తుక్కులూరు, చార్లెస్ నగర్, వెంకటరామాబాద్, సుప్రీమ్‌పేట ఏరియాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు నీరాజనాలు పలికారు. సొంగా రోషన్ అమ్మమ్మవారి గ్రామమైన సుప్రీమ్‌పేటలో కాలనీవాసులు సొంగా రోషన్‌కుమార్ దంపతులకు గజమాలతో స్వాగతం పలికారు. బోయగూడెంలో మహిళలు హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి ఐదేళ్లని దుకాణం మూసివేశారన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. స్థానికంగా ఏ గ్రామం వెళ్ళినా రోడ్లు లేవు. దళితవాడల్లో గ్రామాల్లో డ్రెయినేజీలు లేవు. అనేక కాలనీల్లో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని అన్నారు. తాను గెలిస్తే చింతలపూడిని అభివృద్ధి చేస్తానని, అసెంబ్లీ పార్లమెంట్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పక్కాల వెంకటేశ్వరరావు, బోడా అనిష్‌కుమార్, చీదరాల మధుబాబు, తోట నారాయణరావు, వి.నాగభూషణం, కోండ్రు దేవా, కొత్తపూడి శేషగిరిరావు, తాటి అప్పారావు, టి.విజయ్‌కుమార్, అట్లూరి శ్రీనివాసరావు, రాజారత్నం, సొంగా ఏసుపాదం, బూసి రమేష్, జయపాల్ పలువురు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం : పుట్టా మహేష్

చింతలపూడి, మే 4: చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పలగాని సాయి కుటుంబాన్ని ఏలూరు కూటమి టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ శనివారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయి కుటుంబానికి అండగా ఉంటామని, ఆ పిల్లలకు చదువు చెప్పిస్తామని తెలిపారు. కార్యకర్తలు బయటకు వచ్చి ఇంటికి వెళ్లేవరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. కుటుంబం మొత్తం మీపై ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలన్నారు.

భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, మే 4: ఏడుకొండల స్వామి సన్నిధి శనివారం భక్తజనుల గోవిందనామాలతో ఆధ్యాత్మికతను సంతరించుకుంది. ఎండ మండుతున్నా లెక్కచేయకుండా భక్తులు ఆలయానికి విచ్చేశారు. దాదాపు 20 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు.



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

చిన్నవెంకన్న సేవలో ఎన్నికల అధికారులు

చిన వెంకన్న ఆలయాన్ని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్‌లు బాలసుబ్రహ్మణ్యం, కమలకాంత్ సరోచ్‌లు శనివారం సందర్శించారు. ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం బంగారువాకిలి మీదుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అర్చకులు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

స్వామిని మాకు దూరం చేస్తారా..

» ఇదెక్కడి దారుణమంటూ స్థానికుల ఆందోళన

ద్వారకాతిరుమల, మే 4: ఆలయం చుట్టూ ద్వారాలు మూసివేయడమే కాకుండా ఆలయంలోకి ప్రవేశం లేకుండా స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శనివారం ఉదయం ఈవో గెస్ట్‌హౌస్ వద్ద పలువురు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ప్రతీ శనివారం స్వామివారి హారతి చూసేవారిమని ఈరోజు ఆ భాగ్యం లేకుండా చేశారంటూ దుయ్యబట్టారు. కొన్నేళ్లుగా ద్వారకాతిరుమల, పరిసర ప్రాంత ప్రజలు ప్రతీ శనివారం స్వామివారి హారతి చూసి వెళ్తారు. తాజాగా ఆలయ అధికారులు సెక్యూరిటీ సాకుతో ఆలయ తూర్పుగోపురం మినహా అన్ని గోపుర ద్వారాలు మూసివేశారు. తూర్పుగోపురం నుంచి స్థానికులు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ సెక్యూరిటీ అడ్డుకోవడంతో నిరాశకు గురై ఈవో వసతి గృహం ముందు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన మొగతడకల శ్రీనివాసరావు, శ్రీధర్, ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ భక్తులను భగవంతుని నుంచి దూరం చేసేందుకే అధికారులు ఇలా తాళాలు బిగిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని వాదించారు. ఛైర్మన్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఈవో త్రినాథరావు హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.



ఈవోతో మాట్లాడుతున్న స్థానికులు

నేత్రపర్వం.. శ్రీనివాసుని గరుడోత్సవం

ద్వారకాతిరుమల, మే4: లక్ష్మీపురంలోని శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన శ్రీనివాసుని కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడోత్సవం నేత్రపర్వమైంది. గరుడవాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను తిమ్మాపురానికి తీసుకెళ్లి నిర్వహించిన ఉత్సవం ఆద్యంతం భక్తులను అలరించింది

అంజనీపుత్రునికి జన్మ నక్షత్రపూజలు

ఏలూరు కార్పొరేషన్, మే 4 : శ్రీ ఆంజనేయస్వామి జన్మనక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్ర పర్వదినాన్ని పునస్కరించుకుని శనివారం నగరంలోని పలు డివిజన్లలోని గల ఆంజనేయస్వామి ఆలయాలవద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామికి తమలపాకులు, సింధూరంతో అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణ జరిపారు. అర్చకులు స్వామికి తొలుత ఏకాదశ ద్రవ్యములతో పంచామృతాభిషేకాలు జరిపి అనంతరం విశేష హారతులిచ్చి ప్రత్యేక అలంకారం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కలుగజేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరూధిని ఏకాదశి పూజలు

కామవరపుకోట, మే 4 : సహస్ర గోదాన ఫలితాన్ని ఇచ్చే అత్యంతపవిత్రమైన వరూధిని ఏకాదశి పర్వదినం కావడంతో శనివారం భక్తులు చెలికాని భాస్కరరావు ఆధ్వర్యంలో కళ్లచెరువు గ్రామంలో విశేష పూజలు జరిపారు. శ్రీవారికి తులసీదళాలు పుష్పాలతో అర్చనలు జరిపారు. గోవింద నామసంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ శ్రీవారి చిత్రపటంతో గ్రామోత్సవం జరిపారు. ఈమేరకు గ్రామంలో శ్రీవారి సంకీర్తనల సందడి నెలకొంది.

హోం ఓటింగ్ నూరుశాతం పూర్తి

» దెందులూరు రిటర్నింగ్ అధికారి లావణ్యవేణి

దెందులూరు,మే 3 : దెందులూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తయిందని దెందులూరు రిటర్నింగ్ అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి. సహాయ రిటర్నింగ్ అధికారి జితేంద్ర తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, అనారోగ్య సమస్యలు, పలు కారణాలతో రాలేనివారు 95 మంది ఉండగా మొదటి రోజు 87 మంది, రెండోరోజు శనివారం 8 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ప్రతి టీమ్‌లో పీవో, ఏపీవోతో పాటు వీడియోగ్రాఫర్, పోలీస్ గార్డు, మైక్రో అబ్జర్వర్ ఆధ్వర్యంలో హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు.



దెందులరులో హోం ఓటింగ్ దృశ్యం

ఉంగుటూరు నియోజకవర్గంలో 113 మంది..

ఉంగుటూరు, మే : ఉంగుటూరు నియోజకవర్గంలోని 223 మంది హోం ఓటర్లకు గాను శుక్రవారం 113 మంది వినియోగించుకోగా శనివారం మిగిలిన వారు వినియోగించుకున్నారని రిటర్నింగు అధికారి ఖాజావలి తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

కుక్కునూరు, మే 4 : కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల నుంచి పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారు. గొమ్ముగూడెం గ్రామం నుంచి గుమ్మల ప్రకాష్‌తో పాటు పది కుటుంబాలు టీడీపీలోకి చేరారు. ఏలూరు కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకు న్నారు. ఇటీవల కివ్వాక గ్రామం నుంచి శ్రీరంగం ఆధ్వర్యంలో పలువురు ఎంపీ అభ్యర్థి సమక్షంలో చేరారు. కుక్కునూరు మండలంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని కూటమి అభ్యర్థుల విజయం తథ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు.



టీడీపీలో చేరుతున్న పలు పార్టీల నాయకులు

జనసేనలో చేరికలు

ఉంగుటూరు, మే 4 :ఉంగుటూరులో శుక్రవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. దీనిలో భాగంగా జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజక వర్గ సమన్వయ కర్త వట్టి పవన్‌కుమార్ సమక్షంలో సూరత్తుల శ్రీను, రంగు నాగేశ్వరరావు, కొమ్మిన ఆదియ్య, అడపా అంతర్వేది తదితరులు చేరారు.



ఉంగుటూరులో వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరిన దృశ్యం

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు, మే 4 : పెదపాడు సెక్షన్ 33కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ పరిధిలో న్యూలైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 6,7,8వ తేదీల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుతు సరఫరా నిలుపుదల చేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, రాళ్లపల్లివారిపాలెం, నాయుడుగూడెం పరిసర ప్రాంతాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలి

పెదపాడు, మే 4 : ఎన్నికల విధుల్లో వున్న ప్రభుత్వ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వకుండా పలువురు ఎన్నికల ఆర్వోలు ఇబ్బంది పెడుతున్నారని ఐఎన్‌టీయూసీ నాయకుడు పులి శ్రీరాములు ఆరోపించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణం పోస్టల్ బాల్యెట్ల సౌకర్యం కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొందరు ఆర్వోలు పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా సాకులు చెబుతున్నారని ఆరోపించారు. వారి వైఖరి మార్చుకోకపోతే చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు తగుచర్యలు నిమిత్తం ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఉద్యోగుల బ్యాలెట్ సమస్యలు పరిష్కరించాలి

పెదపాడు, మే 4 : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ లావణ్యవేణిని కోరారు. వట్లూరు సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల సరళిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పలువురు ప్రభుత్వ ఉద్యోగులు చింతమనేని దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఉద్యోగులు తెలిపిన సమస్యలను ఆర్వో లావణ్యవేణి దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేసుకుని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపడతామని ఎన్నికల అధికారులు తెలిపారు.



రెడ్డి మహిళా కాలేజీలో మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న చింతమనేని

తల్లీబిడ్డల విభాగం వద్ద గుడారం ఏర్పాటు

ఏలూరు క్రైం, మే 4 : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని తల్లీ బిడ్డల విభాగానికి వచ్చే వారికి వేసవి నుంచి సేద తీరడానికి జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ గుడారాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం అనేక మంది ఆసుపత్రికి వస్తూ ఉంటారని, తల్లీబిడ్డల విభాగంలో మహిళలను మాత్రమే అనుమతి స్తారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఎండకు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక గుడారాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ప్రజలు ఎండబారిన పడకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, సునీల్, శ్రీనివాసరావు, హరీష్ పలువురు పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన గుడారం



కేఆర్‌పురంలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఉద్యోగులు



ఓటుహక్కు వినియోగించుకున్న సూర్యతేజ

ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

» పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

బుట్టాయగూడెం, మే 4 :ప్రభుత్వ ఉద్యోగులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు.

40 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్..

పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవంలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 40 శాతం జరిగినట్టు అధికారులు తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోడానికి ఉద్యోగులు ఉదయాన్నే ఐటీడీఏకు చేరుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఉద్యోగులు 2,880 మంది ఉండగా తొలి రోజున సుమారు 1195 మందికి పైగా ఓటుహక్కును వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో కూడా ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద సౌకర్యాల కల్పనపై ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అడిగితేగాని అధికారులు స్పందించలేదన్నారు.

చింతలపూడిలో 48 శాతం పోలింగ్

చింతలపూడి, మే 4: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 4,5 తేదీల్లో రెండురోజుల పాటు జరిగే పోలింగ్‌బూత్‌లో తొలిరోజు ఉదయం ఎన్నికల డ్యూటీకి వచ్చిన ఉద్యోగులు తమ ఓటు కనిపించడం లేదంటూ ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారి కె.అద్దయ్య పోలింగ్ బూత్‌కు వచ్చి ఎక్కడ పనిచేసేచోట ఉన్నారో అక్కడ ఫారం-12 దరఖాస్తు చేస్తే అక్కడే ఓటు వేయాలని సూచించారు. అయితే ఉద్యోగులు మాత్రం ముందుగా తమకు శిక్షణ శిబిరంలో చెప్పింది ఒకటి ఇప్పుడు చేస్తుంది ఒకటి అని ఆరోపించారు. తొలిరోజు పోలింగ్ 48.19 శాతం నమోదైంది. నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది 2,079 ఉండగా, తొలిరోజు 1,002 ఓట్లు పోల్ అయ్యాయని, అధికారులు ప్రకటించారు.

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

ఉంగుటూరు, మే 4 : ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ కప్రక్రియను శనివారం ఎన్నికల పరిశీలకులు డాక్టర్ కృష్ణ కాంత్ పాఠక్ పరిశీలించారు. ఆయనతో పాటు పాటు రిటర్నింగు అధికారి ఖాజావలి పాల్గొన్నారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన శనివారం నారాయణపురం హైస్కూలులో ఈవీఎంల కమిషనింగ్‌ను జరిపారు. 214 పోలింగ్ బూత్‌లకు సంబంధించి శుక్రవారం వీవీ ప్యాట్‌లలో సింబల్ అమరిక జరిపారు. శనివారం ఈవీఎంవల కమిషనింగ్‌ను జరిపారు.



ఈవీఎంల కమిషనింగ్ పరిశీలిస్తున్న రిటర్నింగు అధికారి ఖాజావలీ

చెక్‌పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి, మే 4: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టులలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, అక్రమ తరలింపులు గుర్తిస్తే వాటిని వీడియోలతో సీజ్ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు టి.జోర్డన్‌బాటియా సూచించారు. శనివారం మండలంలోని రాష్ట్రసరిహద్దు చెక్‌పోస్టులు లింగగూడెం, అలిపెల్లి చెక్‌పోస్టులను ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఏలూరు నియోజకవర్గ సహాయ వ్యయపరిశీలకులు పీఎస్‌వీఎస్ శివనాగరాజు తదితరులు ఉన్నారు.



అలిపెల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీకి వచ్చిన వ్యయ పరిశీలకులు జోదన్‌బాటియా

క్రైం వార్తలు

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 4 : వేగంగా వెళ్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఒక గుర్తుతెలియని వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్‌ఐ డి.నరసింహారావుకు అందడంతో తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే స్టేషన్ దాటిన తరువాత తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు అతి వేగంగా వెళ్తుండగా అందులోనుంచి 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కల్గిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కల్గి, సామాన్య దేహదారుఢ్యంతో ఉన్నాడు. నలుపురంగు అడ్డచారల గల కాషాయరంగు పొట్టి చేతుల టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ 95020 96672 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ద్వారకాతిరుమల, మే 4: ద్వారకాతిరుమల క్షేత్రంలో శివాలయం నుంచి వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పడంతో మహిళ కిందపడి గాయాలపాలైంది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న దేవాలయ డీఈ సూర్యనారాయణ ఆమెను అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. తాడేపల్లిగూడెంకు చెందిన లక్ష్మణ్‌రెడ్డి, తన భార్య సత్యకృష్ణవేణి, ఇద్దరు పిల్లలతో కలసి శ్రీవారి ఆలయానికి వచ్చి దర్శనానంతరం శివాలయం రోడ్డు మీదుగా కిందకు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రథమచికిత్స అనంతరం ఆమెను తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

బుట్టాయగూడెం, మే 4 :సార్వత్రిక ఎన్నికల నిర్వహ ణలో భాగంగా శనివారం కోట రామచంద్రపురం పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎస్.ఎ.రామన్, జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు టి.శ్రీధర్ కలిసి పరిశీలించారు. నియోజకవర్గ కేంద్రాల వారీగా ఈవీఎంల కేటాయింపు, పోలింగ్ కేంద్రాలకు తరలించే విధానం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే భద్రతా ఏర్పాట్లను అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే రూట్ మ్యాప్‌ను, భద్రత తదితర అంశాలపై తగిన ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. ఏఆర్‌వో ప్రసాద్, ఏపీవో నాయుడు తదితరులు ఉన్నారు. అనంతరం ఐటీడీఏలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిసిటేషన్ సెంటర్‌ను అధికారులు పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓటింగ్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు.



కేఆర్‌పురంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రామన్

'స్వీయ రక్షణ బాలికలకు ఎంతో అవసరం'

ఏలూరు రూరల్, మే 4:వైఎంహెచ్‌ఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా కరాటే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నా రు. ఆర్.వేణుగోపాల్ శ్రీనివాస్ శిక్షణలో స్వీయరక్షణ తరగతులు బాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. శరీర ధృఢత్వానికి సంబంధించి వ్యాయామ, మానసిక ధృఢత్వానికి ధ్యాన, యోగ, కుంగ్‌ఫూలో శిక్షణ అందిస్తున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు శిక్షన తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ, కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులు, మహాలక్ష్మి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరాటేలో శిక్షణ పొందుతున్న మహిళలు, చిన్నారులు

భూములను కట్టబెట్టేందుకే భూహక్కుచట్టం

ఏలూరుటూటౌన్, మే 4 : రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూయాజమాన్య హక్కుల చట్టం తీసుకొ చ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. ఏలూరు అన్నే భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే 512 జీవోను తక్షణమే రద్దు చేయాలన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా ఏపీలోనే ఈ చట్టాన్ని జగన్ ఎందుకు అమలు చేస్తున్నాడని ప్రశ్నించారు. ఈ చట్టం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా రెవెన్యూ అధికారులకే అధికారం కట్టబెట్టడం అన్యాయం అన్నారు. రాజ్యాంగ హక్కులను సైతం తుంగలో తొక్కి రైతులు, ప్రజలను ఇబ్బందికి గురి చేసే ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

నేడు ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ వర్కర్స్ మహాసభ

ఏలూరు రూరల్, మే 4: శ్రీవినాయక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ అసోసియేషన్ 9వ వార్షిక మహాసభను ఆదివారం ఉదయం చేబ్రోలు రోడ్డు బోగచర్లలో ఉన్న ఆచంట సత్తిబాబు తోటలో నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు నాయుడు గంగాధర్‌రావు, గోవాడ కోటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొజ్జా రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబ్లింగ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు దళితుల ఆత్మీయ సమావేశం

లింగపాలెం, మే 4:దళితులంతా ఏకమై వైసీపీ ప్రభుత్వ ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని నియోజకవర్గ దళిత నాయకులు పేర్కొన్నారు. శనివారం వేములపల్లి గ్రామంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లి శ్రీను, తాడేపల్లి దాసు, నత్తా నాగేంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం వేములపల్లిలో చింతలపూడి నియోజకవర్గ దళితుల ఆత్మీయసమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దళితులంతా ఏకమై తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ హయాంలోనే దళితులకు అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. సమావేశానికి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పాల్గొంటారన్నారు. లింగపాలెం మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, పాతూరి మురళీ, దళిత నాయకులు ఉన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

బుట్టాయగూడెం, మే 4 : తెలుగుదేశం పార్టీ నిర్ణయం మేరకు కూటమి అభ్యర్థులకు మాత్రమే ప్రచారం చేయాలని అలా కాకుండా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అందరూ పొత్తు ధర్మం పాటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజుకు గాజుగ్లాసుకు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌కు సైకిల్ గుర్తు పట్ల గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి గెలిపించాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

గణాంకశాస్త్రంలో సుధాకర్‌కు డాక్టరేట్

ఏలూరు ఎడ్యుకేషన్, మే 4:గణాంకశాస్త్ర విభాగంలో చేసిన పరిశోధనలకుగాను స్థానిక కేపీహెచ్‌ఎల్ డిగ్రీ కళాశాల హెచ్‌వోడీ పల్లికొండ సుధాకర్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. కొత్తగా యూజీసీ ప్రవేశపెట్టిన మార్గదర్శకాల ప్రకారం నాలుగేళ్ళ డిగ్రీ హానర్స్ విద్యను బోధించాలంటే డాక్టరేట్ అర్హతలు తప్పనిసరి అని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు వివరించారు. సుధాకర్‌ను కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ వి.మురళీమోహనరావు, కాకర్ల వేణుబాబు, ప్రిన్సిపాల్ ఎన్.గోపీకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు.

తొమ్మిది మంది వలంటీర్ల రాజీనామా

లింగపాలెం, మే 4: లింగపాలెం మండలంలో తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో రాంబాబు శనివారం తెలిపారు. లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామానికి చెందిన వలంటీర్లు తాము వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు తెలిపారన్నారు. వాటిని ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు.




కూల్‌గా : శీతల పానీయం తాగుతున్న చంద్రబాబు

ఫుల్ జోష్

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నూజివీడు ప్రజాగళం సభలో పాల్గొన్నారు. సభకు పెద్దసంఖ్యలో మహిళలు, యువత, అభిమానులు విచ్చేశారు. యువత విక్టరీ చూపుతూ ఉత్సాహం నింపారు.








ఒక ఫొటో తీసుకుంటా..






విజయం మనదే : సభలో విక్టరీ సంకేతం చూపుతున్న చిన్నారులు, మహిళలు

ప్రజల కోరిక మేరకే మళ్లీ పోటీ

'ఆంధ్రజ్యోతి'తో కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇంటర్వ్యూ



1983లో ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి తెలుగుదేశంలో ఉన్నా. సేవలను గుర్తించి అప్పటిలోనే ఎన్టీఆర్ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. 30 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ చేపల రైతు అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశా. 2014 నుంచి 2019 వరకు కైకలూరు ఎమ్మెల్యేగా పనిచేయడమే గాక కూటమిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రిగా పనిచేసి కైకలూరు నియోజకవర్గాన్ని రూ. 730 కోట్లతో అభివృద్ధి చేశా. నియోజకవర్గంలో ఆసుపత్రుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించా.

■ప్రజల ఒత్తిడితోనే మళ్లీ పోటీ..

వైసీపీ పాలనపై విరక్తి చెందిన ప్రజలు నేను పోటీ చేయాలని ఒత్తిడి చేశారు. ఐదేళ్లలో ఎక్కడ చూసినా అక్రమ కేసులు, రౌడీయిజాలు పెచ్చరిల్లిపోయాయి. ఇసుక మాఫియా, అవినీతితో ప్రజలు విసిగిపోయారు. వైసీపీని ఓడించాలంటే సరైన నాయకులు మీరేనంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజలు నాపై ఒత్తిడి తెచ్చారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించాలనే బరిలో దిగా. నన్ను గెలిపిస్తే గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలు ఎంత స్వేచ్ఛగా జీవించారో అంతకంటే స్వేచ్ఛగా జీవించేందుకు కృషి చేస్తా.

■కొల్లేరు సమస్య ఎలా పరిష్కరిస్తారు..

కొల్లేరుకు శాశ్వత పరిష్కారాన్ని తీసుకువచ్చి ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తా. కాంటూరు కుదింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి కాంటూరును 5 నుంచి 3కు తగ్గిస్తే 30 వేల ఎకరాలు భూములు ప్రజలకు చెందుతాయి. దీని ద్వారా వారి అభివృద్ధి మెరుగుపడుతుంది. ప్రతి ఏటా మత్స్యకారుల సొసైటీలకు వెదురుగడలు, వలలు, సైకిళ్ళు, మోటారు సైకిళ్ళు వ్యాన్లును అందజేస్తాం. వైసీపీ పాలనలో కొల్లేరు ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడమే గాక అక్రమ తవ్వకాల పేరుతో కొల్లేరు గ్రామాల ప్రజలను అప్పులపాలు చేశారు. ఆ గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తాను.

■ఎత్తిపోతల పథకం నిర్మించింది నేనే...

కలిదిండి మండలం కొండంగి ప్రాంతంలో ఉప్పుటేరులో నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా కాలువలకు సరఫరా చేసి 30 వేల ఎకరాల ఆక్వా చెరువులకు సాగునీరందించా. ఉప్పుటేరులోని నీటిని కాలువల ద్వారా ఆయా చేపలచెరువుల రైతులకు ఈ నీరు చేరడంతో ఆ రైతులు సాగులో లాభాలార్జించారు. కలిదిండిలో రూ.80 లక్షలతో నూతనంగా బస్టాండ్, రైతు బజారు నిర్మించా. అయితే పనులు పూర్తికాక ప్రారంభించలేదు. వైసీపీ నేటికీ రైతుబజారుని ప్రారంభించలేకపోయింది. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతబజారును ప్రారంభించి రైతులు కూరగాయలను అమ్ముకునేలా చేస్తాం.

■ఆక్వా అభివృద్ధికి కృషి చేశా..

గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 8 విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మాణం చేసి 1600 ట్రాన్స్‌ఫార్మర్లను ఉచితంగా రైతులకు అందించా. అలాగే రైతులు చేపలు అమ్ముకోవాలంటే ఇతర రాష్ట్రాల్లో ఫార్మలిన్ సమస్య తలెత్తి దిగుమతులు నిలిపివేయడంతో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతోనూ కేంద్రంతోనూ చర్చించి మళ్లీ ఎగుమతులు అయ్యేలా చర్యలు తీసుకొని రైతులకు మేలు చేశా. మళ్లీ గెలిపిస్తే ఇంకా ఎక్కువ మేళ్లు చేస్తా.

■విద్య, వైద్య సదుపాయాలు కల్పించా...

కైకలూరులో సీహెచ్‌సీ నూతన భవనాన్ని 10 కోట్లతో నిర్మించా కొన్ని కారణాల వలన ఆలస్యం కావడంతో నేటికీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయలేదు. అలాగే అనేక గ్రామాల్లోని సీహెచ్‌సీలను అభివృద్ధి చేసి ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సదుపాయం అందించాను. అలాగే విద్యాపరంగా కలిదిండిలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో స్థల సేకరణ చేసి రూ. 8 కోట్లతో నూతన భవన నిర్మాణం చేశా. మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశా.

■మంచినీటి పథకాలను వైసీపీ నాశనం చేసింది..

నా హయాంలో 3 కోట్ల వ్యయంతో గోదావరి నీటిని మోటార్లు ద్వారా పైప్‌లైన్ నిర్మించి పెంచికలమర్రులోని సామూహిక ఉచిత మంచినీటి పథకానికి నీరు తీసుకువచ్చి 8 గ్రామాలకు తాగునీటిని అందించా. కైకలూరు పట్టణంలో 2.8 కోట్లు వ్యయంతో ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ నిర్మాణంతో పాటు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించా. వైసీపీ ఒక్క కొత్త పథకం తేకపోగా పెంచికలమర్రులో మంచినీటి పథకాన్ని నిర్వీర్యం చేసింది. ఫిల్టర్‌బెడ్లు పనిచేయక ప్రజలు కలుషిత నీరే తాగుతున్నారు. నేను అధికారంలోకి వస్తే జలజీవన్ మిషన్ ద్వారా అవసరమైన అన్ని గ్రామాల్లోనూ నూతన పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టడంతో పాటు మంచినీటి పథకాలను వినియోగంలోనికి తీసుకువస్తా.

■ప్రజా రవాణా ఇబ్బందులు ఎలా తొలగిస్తారు..

కైకలూరు ప్రాంతంలో ఇటీవల రైల్వే డబ్లింగ్ పనులు పూర్తికావడంతో రోజూ వందలాది రైళ్ళ రాకపోకలు జరుగుతున్నాయి. రైల్వే గేట్లు వేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అండర్ టన్నెల్ నిర్మించి సమస్య పరిష్కరిస్తా.

■కూటమి సంపూర్ణ సహకారం..

కైకలూరులో టీడీపీ, జనసేన పార్టీ నేతలు సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారు. వైసీపీ వ్యతిరేక విధానాలతో నా విజయం ఖాయం. అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందుతా.

-కైకలూరు

ప్రహసనంగా పోస్టల్ బ్యాలెట్

» ఉద్యోగుల సహనానికి పరీక్ష

» ఏర్పాట్లలో అధికారులు విఫలం » ఆలస్యంగా పోలింగ్

కైకలూరు, మే 4: ఎన్నికల నిర్వహణలో అధికారుల అలసత్వం మొదటి రోజే బహిర్గతమైంది. గత నెల రోజులుగా ఎన్నికల కమీషన్ అనేక శిక్షణా తరగతులను నిర్వహించింది. అయినా అధికారులు పోలింగ్ ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లును ముందుగానే చేసుకోకపోవడంతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం రోజునే సమయానికి ఓటింగ్ ప్రారంభించ లేకపోయారు. కైకలూరు నియోజకవర్గంలోని ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు కైకలూరులో ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేసుకునే ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు ఉదయం 10.40వరకు కూడా ప్రక్రియ ప్రారంభించలేదు. దీంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఉదయం 8 గంటలకే పాత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఉద్యోగులు సుమారు 3 గంటలు నిరీక్షించడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎన్ని కల ప్రక్రియలో కీలకమైన రోజు మే 13న జరిగే ఎన్నికల్లో అధికారులు ఇదే తరహాలో పనిచేస్తే ప్రజలు ఓట్లు వేసేందుకు కూడా ఇబ్బందులకు గురవుతారని ఉద్యోగులు గుసగుసలాడుకున్నారు. ఓట్లు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు కైకలూరు నియోజకవర్గం నుంచి ఒక్క బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేశారు. అలాగే ఎంపీ అభ్యర్థికి ఒక్కొటి చొప్పున అయినా ఓటింగ్ ప్రక్రియ మందకొడిగా జరిగింది. మధ్యాహ్నా ఎండ సమయంలో సైతం ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఏలూరు జిల్లాకు ఒక ఓటింగ్ కేంద్రం, కృష్ణా జిల్లాకు ఒక ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 1246 ఓట్లు ఉండగా వీటిలో కైకలూరు నియోజకవర్గానికి చెందినవి 500 ఓట్లు ఉండగా మిగిలిన జిల్లాలకు 746 ఓట్లు ఉన్నాయి. ఈ కౌంటర్లలో ఓట్లు వేసేందుకు వరుస వారీగా స్లిప్‌లను పంపిణీ చేశారు. స్లిప్ నంబర్లను సైతం ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తానే స్వయంగా మైక్‌లో ప్రచారం చేస్తున్నా ఇతర అధికారులు చోద్యం చూస్తూ నిలబడ్డారే తప్ప ఐఏఎస్ అధికారి చేతిలోంచి మైకు తీసుకోలేదు. కింది స్థాయి అధికారులు చేయవలసిన పనిని సైతం ఐఏఎస్ అధికారి చేయడం అక్కడికి ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులను సైతం విస్మయానికి గురిచేసింది. రాత్రి 7.30 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కైకలూరు నియోజకవర్గంలో 860 ఓట్లుకు గాను 349 ఓట్లు పోల్ అవ్వగా వివిధ జిల్లాలకు చెందిన 170 ఓట్లు పోల్ అయినట్లు రిటర్నింగ్ అధికారి కె భాస్కర్ తెలిపారు.


కైకలూరులో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఉద్యోగుల క్యూ

ఫెసిలిటేషన్ సెంటర్లో అధికార పార్టీ నాయకులకేం పని?


అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు

నూజివీడు టౌన్, మే 4: నూజివీడు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగడంతో ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగస్తులు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లో నిబంధనలకు విరుద్ధంగా నూజివీడు జడ్పీటీసీ

అధికార దుర్వినియోగం చేశారని టీడీపీ నేతల ఆగ్రహం

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజుతో పాటు నూజివీడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ఉండటంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రభావితం చేసేలా గుడిమెళ్ళ కృష్ణంరాజు అక్కడ ఉండటం తగదని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి, టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై తమ వద్ద పాస్‌లు ఉన్నాయని అధికార పార్టీ నాయకులు పేర్కొనగా ఈ విషయాన్ని నూజివీడు ఆర్వో వై.భవానీశంకరి దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకున్న ఆమె సదరు పాస్‌లు చెల్లుబాటుకావని, వారిని తక్షణం ఫెసిలిటేషన్ సెంటర్ నుంచి బయటకు వెళ్ళాల్సిందిగా సూచించారు. వాస్తవంగా ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు కావలసి ఉండగా, సరైన భద్రతా ఏర్పాట్లు చేయటంలో అధికారులు అక్కడ పూర్తిగా విఫలం అయ్యారని, ఎవరు అధికారులో, ఎవరు ఓటర్లో తెలియని పరిస్థితి కూడా నెలకొని ఉందంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నూజివీడులో పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించిన కలెక్టర్


పోస్టల్ బ్యాలెట్ పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డీవో

నూజివీడు టౌన్, మే 4: జిల్లాలో 18 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేష్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 వేల మందికి పైగా ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, 2 వేల మంది పోలీస్ సిబ్బంది, జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న 3 వేల మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. వీరికి ఈ నెల 4, 5 తేదీల్లో నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకుంటారన్నారు. ఇతర ఏ జిల్లాలో తమ ఓటు హక్కు ఉన్నప్పటికి ఈ జిల్లాలో వారు పనిచేసే నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు సౌకర్యాలు కల్పించటం జరిగిందని, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు హోమ్ ఓటింగ్ ద్వారా 926 మంది కదల్లేని స్థితిలో ఉన్న వయో వృద్ధులు ప్రత్యేక అవసరాలు కలిగిన వారి వద్దకు వెళ్ళి వారికి ఓటు హక్కు కల్పిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో పాటు నూజివీడు ఆర్డీవో భవాని శంకరి, రెవెన్యూ పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 727 మంది ఓటు హక్కు వినియోగం

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును తొలిరోజు 727మంది వినియోగించుకున్నారు. నూజివీడు నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు నూజివీడులో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గం పరిధి లో ఓటర్లుగా ఉన్నవారు 471, తమ ఓటును వినియోగించుకోగా మొత్తం 727 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు నూజివీడు ఆర్వో వై.భవాని శంకరి తెలిపారు.

చంద్రబాబు పర్యటన సైడ్‌లైట్స్

- చంద్రబాబునాయుడు నూజివీడుకు 3.45 గంటలకు చేరుకున్నారు.
- ముఖ్య నాయకులతో సమావేశమై 4.15 నిమిషాలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- తొలుత నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి అనంతరం ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టామహేష్‌యాదవ్‌లు ప్రసంగించగా, 5 గంటలకు చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- అర్థగంటపాటు సుదీర్ఘంగా సాగిన ప్రసంగాన్ని ఏ మాత్రం విసుగుచెందకుండా ప్రజలు అలాగే నిలబడి వింటూ చంద్రబాబు ప్రశ్నలకు స్పందించారు.
- సభ జరుగుతున్నంత సేపు విజయవాడ రహదారివైపుగా ప్రజలు సభాప్రాంగణానికి వస్తూనే ఉన్నారు.
- భద్రత దృష్ట్యా పోలీసులు నూజివీడు టీడీపీ ఆఫీస్ నుంచి సభా ప్రాంగణం మధ్యలో మూడు రో పార్టీలను ఉంచడంతో చంద్రబాబు సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం కూడా కార్యకర్తలు, ప్రజలు సభా ప్రాంగణానికి తరలివస్తూనే ఉన్నారు.
- చంద్రబాబు తన ప్రసంగంలో మహిళా శక్తి పథకాలను వివరిస్తున్న సమయంలో మహిళల నుంచి విశేష స్పందన వ్యక్తమైంది.
- ముద్దరబోయిన భవిష్యత్ నాది అంటూ చంద్రబాబు హామీ ఇచ్చిన నేపథ్యంలో కార్యకర్తల నుంచి విశేష స్పందన వచ్చింది.
- జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశమై చంద్రబాబు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని అధికారంలోకి వచ్చాక కృష్ణా జిల్లాలో కలుపుతామంటూ హామీ ఇవ్వడంతో స్థానిక ప్రజలు భావోద్వేగంతో స్పందించారు.
- నూజివీడు వచ్చిన చంద్రబాబు సమక్షంలో హెలిప్యాడ్ వద్ద నూజివీడుకు చెందిన పలువురు న్యాయవాదులు, తెలుగుదేశం పార్టీలో చేరారు.
- పామాయిల్ రైతుల సమస్యలపై నూజివీడుకు చెందిన రైతు నాయకులు బొబ్బా వీరరాఘవులు, యనమదల దాసు, తదితరులు చంద్రబాబుకు వినతిపత్రాన్ని అందించారు.

- నూజివీడు టౌన్

నాయకుల మధ్య సయోధ్య

నూజివీడు, మే 4: నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో ఏర్పడిన ప్రతిష్ఠంభన నేపథ్యంలో అధినేత చంద్రబాబు నాయుడు నాయకులకు సయోధ్య కుదిర్చారు. నూజివీడు ప్రజాగళం కార్యక్రమంకు వచ్చిన ఆయన తన క్యారవాన్‌లో నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొలుసు పార్థసారథి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావులతో సమావేశమై ఎన్నికల్లో ఇరువురు కలిసి పనిచేయాలని దిశానిర్దేశం చేసి వారి మధ్య సయోధ్య కుదిర్చి ఇద్దరితో కరచాలనం చేయించారు.

చంద్రబాబు సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



ముసునూరు, ఏప్రిల్ 4: నూజివీడులో శనివారం జరిగిన చంద్రబాబు ప్రజాగళం సభకు మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు బారీగా తరలివెళ్ళాయి. అక్కిరెడ్డిగూడెం, లోపూడి. ముసునూరు, గోపవరం, చెక్కపల్లి, గుడిపాడు తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైక్, ఇతర వాహనాల్లో ర్యాలీగా ప్రజాగళం సభకు వెళ్ళారు. చంద్రబాబు సభకు భారీగా జనం రావడంతో ఈ ఎన్నికల్లో నూజివీడులో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని టీడీపీ నాయకులు పెర్కొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీచేసిన వ్యయ పరిశీలకుడు



చాట్రాయి, మే 4: ఎన్నికల నేపథ్యం లో చాట్రాయి మండలం కృష్ణారావు పాలెంలో అంతరాష్ట్ర సరిహద్దు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు టీ.జోర్ధన్ బూటియా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా చెక్ పోస్టులలో సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. నగదు, మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఏ మాత్రం అనుమానం, ముందస్తు సమాచారం ఉన్నా తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సహాయ వ్యయ పరిశీలకుడు పి.ఎస్.వి.ఎస్ శివనాగరాజు తదితరులు ఉన్నారు.

కుళాయి కనెక్షన్లేవీ?



కలిదిండి, మే 4 : మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ మట్టగుంట పంచాయతీ పరిధిలోని సుందర్ రావు పేట గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు ఆర్జీ ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం పైపులైన్ నిర్మించారని, పైపులైన్ పాడైపోవటంతో పదేళ్లుగా కుళాయిల నుంచి నీరు రాకపోవటంతో సమస్యను పరిష్కరించాలని సర్పంచ్, కార్యదర్శిని కోరగా, పంచాయతీలో నిధులు లేవని చెప్పటంతో ఇంటికి రూ.3 వేలు చొప్పున విరాళాలు వేసుకుని నూతన పైపులైన్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. తాగునీటి కోసం పలు అవస్థలు పడుతున్నామన్నారు. 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో తాగునీరు కొనుగోలు చేసి తాగుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరుతున్నారు. అలుగుల మోజెస్, బసవయ్య, డేవిడ్, రవికుమార్, భీమయ్య, మాణిక్యాల రావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి నుంచే ఓటు' పూర్తి

ముదినేపల్లి, మే 4 : ఇంటి నుంచే ఓటు కార్యక్రమం ముదినేపల్లి మండలంలో పూర్తయింది. మండలంలో 49 మంది 85 ఏళ్ల వయస్సు నిండిన వయో వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి నుంచే వినియోగించుకున్నారు. మండలంలోని ఒకటో క్లస్టర్‌లో 22 మంది నూరు శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండో క్లస్టర్‌లో 27 మందిలో 26 మంది వయో వృద్ధులు ఓటు హక్కును ఇంటి నుంచే వినియోగించుకోగా, పేరూరుకు చెందిన ఒక వృద్ధురాలు ఓటును వినియోగించుకోలేదని తెలిసింది.

చాలా సంతోషంగా ఉంది



ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం తీసుకొచ్చిన నూతన సంస్కరణ బాగుంది. ఇప్పటి వరకు 15 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేశాను. ప్రతిసారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశా. 2019 ఎన్నికల్లో 89 ఏళ్ల వయస్సులో క్యూలో నిలుచుని ఓటు వేసిన తాను ఈ ఎన్నికల్లో ఓటు వేయలేనేమోనని బాధపడ్డా. అనుకోని విధంగా ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం రావటం, ఓటును వినియోగించుకోవటం నా అదృష్టం.

-యెర్నేని వెంకట రత్నం, ముదినేపల్లి


పార్టీలో చేరిన బుడగ జంగాల నాయకులను ఆహ్వానిస్తున్న కామినేని

బుడగ జంగాలు కూటమిలో చేరిక

కైకలూరు, మే 4: వైసీపీ పాలనపై ఉన్న వ్యతిరేకతతో రోజురోజుకి ఎన్డీయే కూటమిలో చేరికలు పెరుగుతున్నాయి. వీరిలో ఎక్కువగా తటస్థంగా ఉన్న వ్యక్తులతో పాటు వైసీపీ ముఖ్య నాయకులు సైతం కూటమి తీర్థాన్ని పుచ్చుకునేందుకు ముందుకు వస్తున్నారు. శనివారం కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్వగృహం వద్ద కలిదిండి మండలం ఆరుతెగలపాడు గ్రామానికి చెందిన బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కూటమిలో చేరారు. వీరందరికి కామినేని టీడీపీ, జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ జంగాలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, వారి కులధ్రువపత్రాలు జాప్యం లేకుండా అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాళ్ళపాలెం జనసేన నాయకుడు పేటేటి కనకలింగేశ్వరరావు, నల్లజర్ల సత్యనారాయణ, చిలుకూరి బుజ్జి, కాళ్ళపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం

కైకలూరు, మే 4: కైకలూరు-ఏలూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కైకలూరు వైఎస్సార్ కాలనీలో నివశిస్తున్న ఆగోళ్ళ శ్రీనివాసరావు(60) కూలి పనిచేసుకొని జీవిస్తున్నాడు. శుక్రవారం ఏలూరు రోడ్డులోని కాలనీలో కూలి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి సైకిల్‌పై వస్తుండగా సీఎన్నార్ గార్డెన్ సమీపాన ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎఎస్సై మల్లికార్జునరావు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.


వెంకటాపురంలో ప్రచారం చేస్తున్న కామినేనికి హారతిస్తున్న దృశ్యం


అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో కామినేని ప్రసంగం

రాక్షస పాలనను సాగనంపాలి : కామినేని

కలిదిండి, మే 4 : ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రజా కంటక రాక్షస పాలనను సాగనంపాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం వెంకటాపురం, గోపాలపురం, గుర్వాయి పాలెం, కలిదిండి, లోడిదలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసకను తవ్వి పర్యావరణానికి ముప్పు కలిగించటంతోపాటు రోడ్లను ధ్వంసం చేశారన్నారు. ప్రతి పనిలో అవినీతి పెరిగిపోయిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, జల జీవన్ మిషన్ ద్వారా సమస్య పరిష్కరిస్తానన్నారు. వైసీపీ సరఫరా చేసిన నాసిరకం మద్యం తాగి లక్షలాది మంది బలయ్యారన్నారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల ఆస్తులు కొట్టేసేందుకు జగన్ పెద్ద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కలిదిండిలో రూ. 42 లక్షలతో బస్టాండ్, రూ. 8 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సొంత భవనాల నిర్మాణం, రూ.13 కోట్లతో కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను నిర్మించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కూటమి అభ్యర్థినైన తనకు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు, పోసిన పాపారావు గౌడ్, గొరిపర్తి సుబ్బారావు, జనసేన నాయకుడు నల్లగోపుల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులంతా ఐక్యంగా మెలగాలి

అగ్నికుల క్షత్రియులంతా ఐక్యంగా మెలగాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కలిదిండిలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమావేశంలో కామినేని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులు నివశించే పల్లిపాలెం గ్రామాలను "పల్లవ"పాలెంలుగా నామకరణం చేసి ప్రత్యేక గుర్తింపునకు కృషి చేస్తానన్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అగ్నికుల క్షత్రియ రాష్ట్ర సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేసిందన్నారు. ఆదరణ పథకం కింద వలలు, పడవలు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల్లో అగ్నికుల క్షత్రియులంతా కూటమి ఎమెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, స్వచ్ఛాంధ్ర మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ సీఎల్. వెంకట్రావ్, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు సంగాని గంగాధరరావు, అంద్రాజు కృష్ణమూర్తి, నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని శశీదేవి, కొల్లాటి సత్యనారాయణ, నడకుదుటి గణపతి, వడుగు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.